
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
చిత్తూరు
జిల్లా వార్తలు
మంగళవారం 30 ఏప్రిల్ 2024



మంత్రి ఊరికే వస్తారా?

ఎర్రాతివారిపల్లెలో బీసీవైపీ శ్రేణులపై వైసీపీ మూకదాడులు

అసెంబ్లీ అభ్యర్థి రామచంద్రయాదవ్‌పై హత్యాయత్నం

సదుం పోలీస్‌స్టేషన్ వద్దే ప్రచార రథానికి నిప్పు



రామచంద్రయాదవ్ వాహనానికి అడ్డుగా పడుకున్న వైసీపీ కార్యకర్త



సదుం పోలీస్‌స్టేషన్‌లో ఉన్న రామచంద్రయాదవ్

పుంగనూరు, ఏప్రిల్ 29 : సదుం మండలంలో బీసీవై పార్టీ అధ్యక్షుడు బి.రామచంద్రయాదవ్‌పై సోమవారం హత్యాయత్నం జరిగింది. ఎర్రాతివారిపల్లె గ్రామం, సదుం పోలీస్ స్టేషన్లలో వైసీపీ అల్లరి మూకలు ఆయనపై దాడికి పాల్పడ్డాయి. పార్టీ ప్రచారరథానికి నిప్పుపెట్టాయి. వాహనాలను ధ్వంసం చేశాయి. ఈ దాడిలో బీసీవై పార్టీ నేతలు పలువురికి గాయాలయ్యాయి.

పుంగనూరు భారతచైతన్య యువజన పార్టీ అభ్యర్థి బోడే రామచంద్రయాదవ్ సోమవారం పార్టీ శ్రేణులతో కలిసి సదుం మండలంలో రోడ్‌షో నిర్వహించారు. బూరగమంద నుంచి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్వగ్రామం ఎర్రాతివారిపల్లెకు వెళ్లగా అయ్యప్ప స్వామి ఆలయం వద్ద రోడ్డుకు బారికేడ్లు అడ్డుపెట్టి గ్రామానికి ఎంత ధైర్యం ఉంటే వస్తారు.. వెనక్కు వెళ్లాలని కొందరు యువకులు హుకుం జారీ చేశారు. ప్రచార రథం డివైడర్ పక్క రోడ్డులో వెళుతుండగా 'వద్దంటే వస్తారా' అంటూ రామచంద్రయాదవ్‌పై రాయి విసరగా ఆయన తప్పించుకున్నారు. ఆయనకు భద్రతగా ఉన్న సీఆర్పీఎఫ్ గన్‌మ్యాన్ వారిని వారించి పక్కకు నెట్టారు. ఈ క్రమంలో వైసీపీ, బీసీవై పార్టీ కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. గొడవ పెరగడంతో ఇరువర్గాల వారు ఘర్షణపడ్డారు. అంతలోనే గ్రామంలోని వారు దుర్భాషలాడుతూ బీసీవైపీ ప్రచార రథంపై రాళ్లు, కర్రలు విసరడంతో అద్దాలు ధ్వంసమయ్యాయి. బీసీవైపీ నేతలు సైతం రాళ్లు విసిరారు. ప్రచారానికి వచ్చిన మహిళలపై దాడి చేశారు. విషయం తెలుసుకున్న సదుం ఎస్‌ఐ మారుతి వచ్చి అనుమతి లేకుండా ఎలా వస్తారని, ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని హెచ్చరించారు. పోలీసుల అనుమతి పత్రంలో ఎర్రాతివారిపల్లె లేకపోవడంతో పార్టీ వారంతా వెనుక్కి రావాలని రామచంద్రయాదవ్ పిలిచారు. గొడవ పెద్దదవుతుందని బీసీవై పార్టీ శ్రేణులు కల్లూరు మీదుగా వెళ్లడానికి ప్రధాన రోడ్డు పైకి రాగా అప్పటికే వైసీపీ మూకలు రోడ్డుకు అడ్డుగా పడుకుని వాహనాలు వెళ్లకుండా అడ్డుకున్నారు. మహిళలపై దాడులు చేయడం దుర్మార్గమని, తాము వెళతామని చెప్పినా వినకుండా వైసీపీ శ్రేణులు వాగ్వాదానికి దిగాయి. పోలీసులు చెప్పినా వినకుండా రాళ్లు, కర్రలు విసురుతూ సదుం వరకు వాహనాలను వెంబడించారు. ఈ దాడిలో పలువురు బీసీవై పార్టీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. రామచంద్రయాదవ్ ప్రచారరథంలోనే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా ఆయన వెంటే వచ్చిన వైసీపీ మూకలు స్టేషన్‌లోకి చొరబడ్డాయి. పోలీసులు తలుపులు మూసి వారిని పంపారు. స్టేషన్ ముందు ఉన్న ప్రచార రథానికి నిప్పుపెట్టగా పోలీసులు నీరుపోసి అదుపు చేశారు. రామచంద్రయాదవ్ ల్యాండ్ క్రూసర్, సీఆర్పీఎఫ్ బలగాలు ఉపయోగించే వాహనంతోపాటు కాన్వాయ్‌లోని దాదాపు 15 వాహనాలను ధ్వంసం చేయడంతో దాదాపు 20 మంది వరకు బీసీవైపీ శ్రేణులు గాయపడ్డారు.



ఎర్రాతివారిపల్లె ఆర్చి వద్ద రామచంద్రయాదవ్ ప్రచారరథాన్ని అడ్డుకున్న వైసీపీ శ్రేణులు



అల్లరిమూకలను చెదరగొడుతున్న పోలీసులు





వైసీపీ నేతల దాడిలో అద్దాలు పగిలిన వాహనాలు

భోజనం పెట్టారని.. బీసీవైపీ నేత ఇంటికి నిప్పు

సదుం మండలం చిలకపాటివారిపల్లెకు చెందిన బీసీవై పార్టీ నాయకుడు ఆనందరెడ్డి ఇంటిపై వైసీపీ మూకలు సోమవారం రాత్రి పెట్రోల్ పోసి నిప్పు పెట్టారు. రామచంద్రయాదవ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా చిలకపాటివారిపల్లెలో ఆనందరెడ్డి తన ఇంట్లో బీసీవై పార్టీ శ్రేణులకు మధ్యాహ్నం భోజనం పెట్టారు. ఈ విషయం తెలుసుకున్న వైసీపీ అల్లరి మూకలు రాత్రి పెట్రోల్ పోసి ఆ ఇంటికి నిప్పు పెట్టారు. ఆ సమయంలో ఆయన భార్య, పిల్లలు ఇంట్లో ఉన్నారు. కిటికీ అద్దాలు ధ్వంసం చేసి, రాళ్లు రువ్వారు.కారును ధ్వంసం చేశారు.విషయం తెలియగానే పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి వెళ్లి మంటలు ఆర్పి వారికి రక్షణ కల్పించారు. సదుం పోలీసులు కేసు నమోదు చేశారు.

పుంగనూరులో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి

పుంగనూరులో ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై ఉంది. మంత్రి పెద్దిరెడ్డి నియోజకవర్గంలో ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు, దౌర్జన్యాలు, దాడులు, అరాచకాలు పెరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదు. సదుం మండలంలో బీసీవై పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం చేస్తుంటే వైసీపీ నాయకులు కార్లు ధ్వంసం చేయడం, కాల్చడం దారుణం.

- చల్లా రామచంద్రారెడ్డి, టీడీపీ అభ్యర్థి

ఇది పోలీసుల వైఫల్యం

సదుంలో బీసీవై పార్టీ ఎన్నికల ప్రచారానికి పోలీసులు భద్రత ఇవ్వకపోవడం వల్లే మంత్రి పెద్దిరెడ్డి అనుచరులు, వైసీపీ అల్లరి మూకలు బీభత్సం సృష్టించాయి. వందల మంది పోలీస్‌స్టేషన్‌లోకి చొరబడి నాపై దాడికి పాల్పడుతున్నా పోలీసులు ఏమాత్రమూ పట్టించుకోలేదు. ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తా.

- రామచంద్రయాదవ్

చిత్తూరు ఎస్పీ మణికంఠ, పలమనేరు డీఎస్పీ మహేశ్వర రెడ్డి సంఘటన స్థలాన్ని, ప్రచారరథాన్ని పరిశీలించి రామచంద్రయాదవ్‌ను విచారించారు. మూడు రోజులుగా వైప్లస్ భద్రత ఉన్న రామచంద్రయాదవ్ ప్రచార రోడ్డుషోకు సదుంలో మాత్రం ఇద్దరు మహిళా పోలీసులను మాత్రమే పంపారు.

చిత్తూరు వైసీపీ అభ్యర్థి ఎర్రచందనం స్మగ్లర్

- అనేక పోలీస్‌స్టేషన్లలో అతనిపై కేసులున్నాయి
- జిల్లాలో విచ్చలవిడిగా డ్రగ్స్, గంజాయి లభ్యం
- అభివృద్ధి పథంలో నడిపించేది టీడీపీయే
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బాలకృష్ణ



చిత్తూరులో ర్యాలీగా వస్తున్న బాలకృష్ణ



చిత్తూరు సభకు హాజరైన జన సందోహం

చిత్తూరు సిటీ, బంగారుపాళ్యం, ఏప్రిల్ 29: ఎర్రచందనం స్మగ్లర్, మద్యం అక్రమ రవాణా, ఇసుక మాఫియా, భూకబ్జా చేసేవాడికి వైసీపీ చిత్తూరు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చిందని, అతనిపై అనేక పోలీస్‌స్టేషన్లలో కేసులున్నాయని విజయానందరెడ్డిని ఉద్దేశించి టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ అన్నారు. స్వర్ణాంధ్ర సాకార యాత్రలో భాగంగా సోమవారం బంగారుపాళ్యం, చిత్తూరులో బాలకృష్ణ బహిరంగ సభలు నిర్వహించారు. ప్రసంగం ఆయన మాటల్లోనే.. 'టీడీపీ హయాంలో జిల్లాకు పెద్దయెత్తున పరిశ్రమల్ని తెచ్చి యువతకు ఉపాధి కల్పించాం. విజయా డెయిరీని పునరుద్ధరిస్తామని అమూల్‌కు కట్టబెట్టేసి కమీషన్లు తీసుకుంటున్నారు. చక్కెర ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేయాలని చూస్తున్నారు. వైసీపీ వచ్చినప్పటి నుంచి చిత్తూరు జిల్లాలో డ్రగ్స్, గంజాయి విచ్చలవిడిగా లభిస్తున్నాయి. యువత భవిష్యత్తును వైసీపీ నాశనం చేస్తోంది. జిల్లాలో టీడీపీ హయాంలోనే అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. వైసీపీ హయాంలో శిలాఫలకాలకే పరిమితమైంది.' అన్నారు.

● తమ్ముడు గురజాలను, అనుభవజ్ఞుడు ప్రసాద్‌రావును గెలిపించండి

'చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న గురజాల జగన్మోహన్ యువకుడు, ఉత్సాహవంతుడు, అందరికీ అందుబాటులో ఉంటాడు. తమ్ముడు గురజాలను కచ్చితంగా గెలిపించండి. ఐఆర్‌ఎస్ అధికారి అయిన దగ్గుమళ్ల ప్రసాద్‌రావుకు అన్ని రంగాల మీద అపార అనుభవం, పట్టు ఉంది. కేంద్రంతో సఖ్యతతో ఉండి అభివృద్ధి చేయగలరు. అనుభవజ్ఞుడ్ని గెలిపించి పార్లమెంటుకు పంపించండి' అని చిత్తూరులో జరిగిన బహిరంగ సభలో బాలకృష్ణ కోరారు.

● మురళీమోహన్‌ను అసెంబ్లీకి పంపండి

'పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్‌ను కచ్చితంగా గెలిపించి అసెంబ్లీకి పంపించండి' అంటూ బంగారుపాళ్యంలో జరిగిన బహిరంగ సభలో బాలకృష్ణ కోరారు. బంగారుపాళ్యంలో జరిగిన సభను చూసేందుకు పలమనేరు, బంగారుపాళ్యం, యాదమరి, ఐరాల మండలాల నుంచి పెద్దయెత్తున ప్రజలు తరలివచ్చారు. బంగారుపాళ్యం నాలుగు రోడ్ల కూడలిలో ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్ గజమాలతో స్వాగతం పలికారు.

● ఆకట్టుకున్న ప్రసంగం.. ఎగబడిన జనం..

చిత్తూరు, బంగారుపాళ్యం ప్రాంతాల్లో సుమారు 45 నిమిషాల పాటు సాగిన బాలయ్య ప్రసంగం ఆకట్టుకుంది. టీడీపీకి బలం కార్యకర్తలేనంటూ, మీ అభిమానాన్ని చూస్తే ఆశ్చర్యమేస్తోందని వారిని ఉత్సాహపరిచారు. ముస్లింలు అధిక సంఖ్యలో కనిపించేసరికి చిత్తూరులో ఉర్దూ భాషలో మాట్లాడి ఆకట్టుకున్నారు.

'లెక్క' తేలింది

ఎన్నికల బరిలో 97 మంది అభ్యర్థులు

పార్లమెంటుకు 19.. ఏడు అసెంబ్లీ స్థానాలకు 78మంది

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 29: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియకు తెరపడింది. చిత్తూరు పార్లమెంటు స్థానానికి ఇద్దరు, ఏడు అసెంబ్లీ స్థానాలకు ఐదుగురు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు.ఎన్నికల బరిలో 97 మంది మిగిలారు. చిత్తూరు, పలమనేరు, నగరి, పూతలపట్టు నియోజకవర్గాల్లో ఒక్కరు కూడా నామినేషన్ ఉపసంహరించుకోలేదు.

బరిలో మిగిలిన అభ్యర్థుల వివరాలిలా ఉన్నాయి.

నియోజకవర్గం	నామినేషన్లు	విత్‌డ్రా	రంగంలో వున్న అభ్యర్థులు
చిత్తూరు పార్లమెంటు	21	02	19
అసెంబ్లీ స్థానాలు....			
చిత్తూరు	13	00	13
పలమనేరు	14	00	14
నగరి	07	00	07
పూతలపట్టు	12	00	12
కుప్పం	15	02	13
పుంగనూరు	10	02	08
గంగాధరనెల్లూరు	12	01	11
మొత్తం	104	07	97

చిత్తూరు ఎంపీ స్థానానికి రెండు బ్యాలెట్ యూనిట్లు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 29 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో చిత్తూరు పార్లమెంటు స్థానానికి 19మంది అభ్యర్థులు బరిలో నిలబడ్డారు. 21మంది ఉండగా వారిలో ఇద్దరు సోమవారం తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. 19 మందికి కలెక్టర్ ఎన్నికల చిహ్నాలను కేటాయించారు. రంగంలో 19 మంది ఉన్నందున రెండో బ్యాలెట్ యూనిట్‌ను వినియోగించడం తప్పనిసరి అయ్యింది. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం 2,200 అదనపు యూనిట్లు కావాలంటూ ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదన పంపింది. సాధారణంగా బ్యాలెట్ యూనిట్‌లో 16 మంది అభ్యర్థులకు మాత్రమే అవకాశం ఉండేలా ఈవీఎంను రూపొందించారు. అంతకంటే అదనంగా అభ్యర్థులు ఉండడం, చివర్లో నోటాకు అవకాశం కల్పించాల్సి రావడంతో రెండో యూనిట్ ఏర్పాటు చేయాల్సి వచ్చింది.

16,547మందికి పోస్టల్ బ్యాలెట్

● ఇందులో 4,633 మంది జిల్లాయేతర సిబ్బంది

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 29: ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న 16,547 మందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తున్నట్లు కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో మీడియాతో మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ పొందనున్న వారిలో జిల్లా ఉద్యోగులు 11,914 మంది, జిల్లాయేతరులు 4,633 మంది ఉన్నారన్నారు. ఇతర జిల్లాల ఉద్యోగులు 12డి ద్వారా పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారని, వారు కోరిన నియోజకవర్గాల్లో మే 5వ తేదీన ఓటు వేసుకోవచ్చని తెలిపారు. దివ్యాంగులు, 85 సంవత్సరాలు మించిన 596 మంది మే 6, 7 తేదీలలో బ్యాలెట్ పత్రం ద్వారా ఓటు హక్కును వారి ఇళ్ల వద్దనే వినియోగించుకోవచ్చునని పేర్కొన్నారు. మే ఒకటి నుంచి ఇళ్ల వద్దే పింఛను పంపిణీ గురించి వివరించారు. ఈ సమావేశంలో డీఆర్వో పుల్లయ్య, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ పాల్గొన్నారు.

గంగజాతర తేదీల మార్పు

21, 22 తేదీల్లో..

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 29: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా చిత్తూరు నగరంలో గంగజాతర మే 13, 14 తేదీల బదులు 21, 22 తేదీల్లో జరుగుతుందని కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చిత్తూరు, పరిసర ప్రాంతాల్లో ఎన్నో ఏళ్లుగా జాతర నిర్వహిస్తున్నారని, ఈ ఏడాది ఎన్నికల కమిషన్ సూచనల మేరకు తేదీల మార్పునకు వంశపారంపర్య ధర్మకర్తలు ఆమోదం తెలిపారని పేర్కొన్నారు. చాటింపు మే 14న ఉంటుందని వెల్లడించారు.

పలమనేరులో 20, 21, 22 తేదీల్లో..

పలమనేరు : పలమనేరు గ్రామదేవత తిరుపతి గంగమ్మ జాతరను మే 20, 21, 22 తేదీల్లో నిర్వహించడానికి గ్రామపెద్దలు తీర్మానించారు. ఇక్కడ ఏటా మే 14, 15, 16 తేదీల్లో నిర్వహిస్తూ వస్తున్నారు. ఏప్రిల్ 30న చాటింపు వేయడం ఆనవాయితీ. అయితే ఈ ఏడాది మే 13న ఎన్నికల దృష్ట్యా పట్టణ పెద్దలు సోమవారం సమావేశమై 20, 21, 22తేదీల్లో నిర్వహించాలని తీర్మానించారు. మే 6వ తేదీ సోమవారం రాత్రి చాటింపు వేస్తారు.

పెన్షన్ సొమ్ము లబ్ధిదారుల ఖాతాల్లోకి..

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 29 : మే నెలకు సంబంధించి పింఛను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమచేసేలా డీఆర్‌డీఏ అధికారులు ఏర్పాట్లు చేశారు. వృద్ధాప్య, వితంతు, చేనేత, దివ్యాంగులు, అభయహస్తం, కల్లుగీత, ఒంటరి మహిళ, మత్స్యకారులు, డప్పు కళాకారులు, సైనిక్ వెల్ఫేర్ ఇలా 16 రకాల పింఛన్లకు జిల్లాలో 2,72,864 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి సంబంధించి రూ.79.87 కోట్ల నిధులు జిల్లాకు చేరాయి. ఈ మొత్తాలను డైరెక్ట్ బెనిఫిషరీ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) పద్ధతిలో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి జమ చేయనున్నారు. ఆధార్ నంబరు లింక్‌తో బ్యాంకు ఖాతాలున్న 1,92,021 మంది పింఛనుదారులకు డీబీటీ ద్వారా, లింకు లేని 80,843 మందికి నేరుగా అందజేయనున్నారు. రెండో తేదీ నుంచి పింఛన్‌దారులు నగదు తీసుకునేందుకు అధిక సంఖ్య ఏటీఎంలు అందుబాటులో ఉంచుతామని అధికారులు తెలిపారు.



జీడీ నెల్లూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి థామస్

ముక్కుసూటిగా మాట్లాడటం.. కిందిస్థాయి కార్యకర్త నుంచి మండల స్థాయి నాయకులను కలుపుకుని వెళ్లడం...నిత్యం ప్రజల్లో ఉంటూ టీడీపీని బలోపేతం చేయడంతోపాటు దళితులతోపాటు అన్ని వర్గాల వారిలో తమ వాడంటూ నమ్మకం కలిగించడం. ఆపదలో ఉన్న వారికి సాయం చేస్తూ ముందుకెళుతున్నారు జీడీ నెల్లూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి థామస్. పార్టీ నేతలు, కుటుంబ సభ్యులను కలుపుకొంటూ ప్రచారంలో క్షణం తీరిక లేకుండా విస్తృతంగా ప్రచారంలో పాల్గొంటున్నారు. జీడీ నెల్లూరును టీడీపీకి కంచుకోటలా ఉన్న కుప్పం నియోజకవర్గంలాగా తయారు చేస్తానని చెబుతున్న థామస్‌తో ప్రత్యేక ఇంటర్వ్యూ...... - చిత్తూరు

సేవకుడిలా పనిచేస్తా

- కులమతాలకు అతీతంగా సొంత బిడ్డలా ఆదరిస్తున్నారు
- 50వేల మంది యువతకు పరిశ్రమల్లో ఉపాధి కల్పిస్తా
- ప్రతి గ్రామానికి మినరల్ వాటర్‌ప్లాంట్
- ప్రత్యేక మ్యానిపెస్టో ద్వారా అభివృద్ధి
- జీడీ నెల్లూరు టీడీపీ అభ్యర్థి థామస్

● రాజకీయాల్లోకి రావడానికి కారణం...

డాక్టర్‌గా పలు దేశాలు తిరుగుతున్నప్పటికీ దేశ, రాష్ట్ర రాజకీయాలను తెలుసుకుంటూ ఉండేవాడిని. ఎంతో మంది రాజకీయ నాయకులను చూశాను. ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ అవుతూ అన్ని వర్గాల వారి ఉన్నతికి కృషి చేస్తున్న వ్యక్తి చంద్రబాబు. ఆయన విజనరీ లీడర్. అందుకే నేరుగా చంద్రబాబును కలిసి తన అభిప్రాయాన్ని ఆయనకు చెప్పాను. ఆయన కూడా తన ట్రాక్ రికార్డును పరిశీలించిన తరువాత నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమించారు. పసలేని కేసులు పెట్టి అకారణంగా చంద్రబాబును జైలులో పెట్టడం తనను మరింత పట్టుదలగా పనిచేసేటట్లు చేసింది. కష్టకాలంలో ఉన్న చంద్రబాబుకు అండగా ఉండాలని.. ఉంటానని అనుకుంటున్నా.

● 70వేల మందికి టెస్ట్‌ట్యూబ్ బేబీలను పుట్టించాను

ఏడుగురు సంతానంలో మా నాన్న పెద్దవారు. అప్పుడు చదువు విలువ తెలిసి నన్ను, మా తమ్ముడిని బాగా చదివించారు. చదువుకునేటప్పుడే డాక్టర్ అవ్వాలని అనుకున్నాను. అందరిలాగా మామూలు డాక్టర్ కాకుండా ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండాలని అప్పుడే నిర్ణయించుకున్నాను. ఎంఎస్సీ మెడికల్ బయోటెక్నాలజీ అంటే ఇష్టం. అందులో క్యాన్సర్, జెనిటిక్స్, ఇమ్యునాలజీ, అగ్రికల్చర్ కోర్సులుంటాయి. అక్కడ నేను ఫర్టిలిటి కోర్సును ఎంచుకున్నారు. ఆ కోర్సును చదవడంతో వాటిపై రీసెర్చ్ చేసి ఫర్టిలిటీ ద్వారా టెస్ట్‌ట్యూబ్ బేబిని పుట్టించడంపై లోతుగా అధ్యయనం చేసి కోర్సును పూర్తి చేశాను. ఇప్పటివరకు 70వేల మందికి టెస్ట్‌ట్యూబ్ బేబీలను పుట్టించారు. 5వేల మందికి ఐవీఎఫ్ శిక్షణ ఇచ్చాను. 50, 56, 59, 62 , 65 ఏళ్ల వృద్ధుల వరకు బిడ్డను పుట్టిస్తాం

● యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తా

జీడీ నెల్లూరు నియోజకవర్గంలో చదువుకున్న యువత ఉద్యోగాల్లేక కూలీలుగానే మిగిలిపోతున్నారు. వారందరికి వారివారి విద్యార్హతను బట్టి ఉపాధి అవకాశాలు కల్పిస్తా. వైసీపీ ప్రభుత్వం యువతను మత్తులోనే పెడుతోంది. వాటిని బ్యాన్ చేసి సొంతకాళ్లపై నిలబడేటట్లు చేస్తా. ఇక్కడ టెన్త్ ఫెయిల్ అయిన వారంతా అలాగే మిగలిపోతున్నారు. వారిలో కూడా ఏదో ఒక నైపుణ్యం దాగి ఉంది. వాటిని వెలికి తీయడానికి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను తీసుకొస్తా. వారికి దేనిమీద అవగాహన ఉందో వాటిని శిక్షణ ఇప్పించి ఉపాధి పొందేటట్లు చేస్తా. డిగ్రీలు, పీజీలు చేసిన వారికి అవసరమైన శిక్షణ ఇచ్చి బయటి ప్రాంతాలు లేదా విదేశాలకు వెళ్లేందుకు కూడా అవకాశం కల్పిస్తాం.

● నియోజకవర్గానికి ప్రత్యేక మ్యానిపెస్టో...

ఒక డాక్టర్‌గా ప్రజల ఆరోగ్యం నాకు ముఖ్యం. నియోజకవర్గంలో నేను పర్యటించినప్పుడు ఆరోగ్య సమస్యలు చాలానే కనపడ్డాయి. సగం రోగాల నివారణకు స్వచ్ఛమైన నీరు లేకపోవడం. దాంతో ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే నియోజకవర్గంలోని ప్రతిగ్రామంలో మినరల్ వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేస్తా. ప్రతి ఊరికి శ్మశానం, దారి వసతి, మహిళా డిగ్రీ కళాశాల, ప్రతి ఒక్కరికి ఆరోగ్యం అవసరం. అత్యసరమైనప్పుడు చిత్తూరు, తిరుపతి, వేలూరు సీఎంసీకి వెళుతున్నారు. ప్రతి మండలంలో 50 పడకల ఆస్పత్రిని తీసుకొస్తా.

● యువత ఉపాధి కల్పనకు పరిశ్రమలు

జీడీ నెల్లూరు నియోజకవర్గలో చెప్పుకోదగ్గ పరిశ్రమలు ఒక్కటీ లేదు. సత్యవేడులో శ్రీసిటీ, అనంతపురంలో కియో పరిశ్రమ ఉంది. జీడీ నెల్లూరులో ఒక్క పరిశ్రమ లేదు. తచ్చూరు రోడ్డులో వెయ్యి ఎకరాల్లో ఫార్మ ఇండస్ట్రీ, లెదర్ ఇండస్ట్రీ, ఐటీ ఇండస్ట్రీ, ఆటో మొబైల్స్, గార్మెంట్ ఫ్యాక్టరీలతో పాటు స్మాల్, మీడియం స్కేల్, లార్జ్ స్కేల్ ఇండస్ట్రీని తీసుకొచ్చి 50 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తా. అంతేకాకుండా చంద్రబాబు నాయుడు ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలిస్తామని చెప్పారు. దాంట్లో కూడా బడుగు, బలహీనవర్గాల వారికి అవకాశాలు వస్తాయి.

● అందరికి భరోసా ఇవ్వడమే...

ఇన్నేళ్లుగా నిరాదరణకు గురైన జీడీ నెల్లూరు నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసుకోవాలంటే అందరం కలిసి పనిచేయాలి. గ్రామాలకు సీసీ రోడ్లు, తాగునీటి వసతి, స్కూల్స్, ఇతర అవసరాలను తీర్చుతాను. ఇల్లు లేని వారికి కట్టించే ఏర్పాటు చేస్తాం. నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే చదువుకున్న నా లాంటి వాడిని ఎంపిక చేసుకోండి. ఇప్పటికే నియోజకవర్గంలోని గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి నేతలను కలుపుకుని పోతున్నాం. ఎక్కడ ఎలాంటి లుకలుకలు లేదు. రానున్న రోజుల్లో కూడా అందరం ఇలాగే కలిసి పనిచేసి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవాలని కోరుతున్నాను.

● ఎమ్మెల్యే అక్రమ సంపాదనలో మునిగితేలారు

జీడీ నెల్లూరు ఎమ్మెల్యే నారాయణస్వామి అక్రమ సంపాదనలో మునిగితేలారు. నియోజకవర్గంలో నాలుగైదు మంది బ్రోకర్లు, రౌడీలను తయారు చేశాడు. బెంగళూరు నుంచి గంజాయి, హెరాయిన్, ఇతర మత్తు పదార్థాలను తీసుకుని అమ్ముకుని అమ్ముకుంటున్నారు. కొంత మంది ఇసుక, క్వారీలు, ప్రభుత్వ భూములను స్వాహా చేస్తున్నారు. బ్రోకర్లు, రౌడీల నుంచి కమీషన్లు వసూలు చేసుకుంటున్నాడు. అదేవిధంగా రూ. వెయ్యి కోట్లు, 500 ఎకరాల భూములను సంపాదించాడు. కల్కి భగవాన్‌ను ఇబ్బంది పెట్టి ఆయన డబ్బులను దోచుకున్నాడు. ఆ డబ్బులతో చెన్నై, పుత్తూరు, తిరుపతి, బెంగళూరు, విజయవాడ, హైదరాబాదు, దుబాయ్‌లు విల్లాలు కొనుక్కున్నాడు.

● వారంలో ఆరురోజులు సుమంగళి జ్యువెలరీస్ వద్ద ఎమ్మెల్యే కారు

ఎమ్మెల్యే నారాయణ స్వామి అక్రమంగా సంపాదించిన డబ్బులతో ఆయన కుటుంబ సభ్యులు జ్యువలరీస్ కొనుక్కుంటారు. పల్లిపట్టు సుమంగళి జ్యువెలరీ వద్ద ఎమ్మెల్యే కారు వారానికి ఆరు రోజులూ గంట నుంచి మూడు గంటలపాటు ఉంటుంది. ఆయన నిజాయితీ పరుడైతే జ్యువెలరీ షాపు సీసీ పుటేజీలను తీయమనండి తెలుస్తుంది.

● రైతులను ఏనాడు పట్టించుకోని నారాయణస్వామి...

జీడీ నెల్లూరు రిజర్వుడు నియోజకవర్గం. ఇక్కడ వ్యవసాయమే ప్రధానం. అలాంటి వ్యవసాయరంగాన్ని ఏనాటు ఎమ్మెల్యే నారాయణ స్వామి పట్టించుకోలేదు. ఎన్టీయార్ జలాశయం నుంచి మిగులు నీటి కాలువద్వారా చెరువులను నింపుతానని గొప్పలు చెప్పారు. ఆ పనులు ముందుకు సాగలేదు. అలాగే క్రిష్ణాపురం రిజర్వాయర్‌లో మట్టిని తీసి మరింత లోతు చేసి కరకట్టలను పటిష్ఠం చేసి నీటి నిల్వను పెంచి రైతులకు ఉపయోగపడేటట్లు చేయాల్సి ఉంది. అది చేయకపోగా... కమీషన్ల కోసం క్రిష్ణాపురం జలాశయం పక్కనే ఇంకో చెరువును రూ. 100 కోట్లతో కడతానని వ్యవసాయ భూములను చూశాడు. రైతులకు ఏం చేయాలో వాటిని వదిలేసి కమీషన్ల కోసం కొత్త పనులు చేస్తామని చెప్పడమంటే రైతులను మోసం చేయడమే.

● మాట వినని వారిపై కేసులు పెట్టారు

ఎమ్మెల్యేగా నారాయణస్వామి సొరా మంత్రిగా ఉన్నారు. నియోజకవర్గంలో ఆయన మాట వినని యువకులు, రైతులు, దళితులు అని చూడకుండా అందరికి కేసులు పెట్టాడు. తన మాట వినని వారిపై సారా కేసులు పెట్టించాడు. మాట వినని వారి మామిడి తోటలు, చెరుకు తోటలకు నిప్పంటించడంతోపాటు వివిధ రకాలుగా వేధించాడు. దళితుల మధ్యే చిచ్చుపెట్టి రాజకీయ పబ్బం గడుపుకునే రకం నారాయణ స్వామి. ఆయన ఒక దళిత ద్రోహి. 72వేల ఓట్లు ఎస్సీలవే. ఎస్సీల ఓట్లతో గెలుస్తున్న ఎమ్మెల్యే వారి మధ్యే చిచ్చు పెడుతున్నాడు. అలాంటి ఎమ్మెల్యేకు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిస్తున్నా.

● మాటల్లోనే ఆయనదంతా..... చేతల్లో ఏమి ఉండదు

వెదురుకుప్పంలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేస్తానని చెప్పాడు. అక్కడ ఒక శిలాఫలకాన్ని పెట్టాడు.అక్కడే క్రికెట్ స్టేడియం కట్టిస్తానని చెప్పాడు. అక్కడు ఇప్పుడు కార్ పార్కింగ్ ఉంది. అలాగే ఎస్టీ కాలనీలను దత్తత తీసుకుంటానని చెప్పాడు. ఒక్క ఎస్టీకాలనీలో అయినా మౌళిక వసతులు కల్పించాడా లేదా ఆ కాలనీల వైపు వెళ్లాడా.

● నాపైన పోటీ చేసేది లడ్డులమ్ముకునే బ్రోకర్

ఎమ్మెల్యేగా ఉన్న నారాయణస్వామి ఒక కాలం చెల్లిన రాజకీయ నాయకుడు. ఆయన రెండుసార్లు ఎమ్మెల్యే, మంత్రిగా, డిప్యూటీ సీఎంగా ఉన్న వ్యక్తికి టికెట్ ఇవ్వలేదంటే ఆయన వైసీపీకే కాకుండా ప్రజలకు ఉపయోగపడరని టికెట్ ఇవ్వలేదు. ఇక నాపై పోటీచేసే అభ్యర్థి అయితే వాళ్ల నాన్న దర్శన టికెట్లను అమ్ముకుంటుంది. దర్శనాలకు లక్ష నుంచి రూ. 50వేలకు అమ్ముకునే మహిళ. ఆమె పేరు కృపాలక్ష్మి కాదు.. వసూళ్లరాణి అనే పేరు పెట్టుకోవచ్చు. ఇలాంటి వారికి అవకాశం ఇస్తే నియోజవర్గం అధోగతిపాలవుతుందన్న విషయాన్ని ప్రజలు గమనించాలి.

● ప్రజల బ్యాంకు బ్యాలెన్స్ పెరిగే విధంగా చేయాలి

ఇన్నాళ్లు నారాయణస్వామిని గెలిపించిన ప్రజలు ఆలోచించుకోవాలి. రోజురోజుకూ ఆయన, ఆయన కుటుంబ సభ్యుల బ్యాంకు బ్యాలెన్స్ పెరిగింది తప్ప ప్రజల బ్యాంకు బ్యాలెన్స్ పెరగలేదు. డాక్టర్‌గా వేలాది మందికి ట్రీట్‌మెంట్ చేసి ఆనందంగా ఉండేటట్లు చేశాను. తాను ఎమ్మెల్యేగా వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు రైతుల అవసరాలను తీర్చుతాను. రాజకీయాల్లోకి రాకముందే ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తిని. సంపాదన కోసం తాను రాజకీయాల్లోకి రాలేదు. ప్రజలకు ఒక సేవకుడిగా సేవ చేయడానికే వచ్చాను.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

ఇద్దరు వలంటీర్లకు షోకాజ్ నోటీసులు

వెదురుకుప్పం : నల్లవెంగనపల్లె పంచాయతీలో జరిగిన వైసీపీ ప్రచారంలో వలంటీర్లు రమేష్, రాజేంద్ర పాల్గొన్నట్లు ఫిర్యాదులు రావడంతో షోకాజ్ ఇచ్చామని, తర్వాత ఆ ఇద్దరిని తొలగిస్తామని చెప్పారు. నల్లవెంగనపల్లెలోని ప్రకాష్, సింధూజ అనే ఇద్దరు వలంటీర్లు సోమవారం రాజీనామా లేఖలను ఇచ్చారని తెలిపారు.

సూపర్‌సిక్స్‌పై అనూహ్య స్పందన : థామస్



దేవళంమిట్ట వద్ద మాట్లాడుతున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్, వైసీపీ నుంచి టీడీపీలో చేరిన నారాయణరాజు

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 29: టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజల్లో అనూహ్య స్పందన వస్తోందని గంగాధరనెల్లూరు ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ పేర్కొన్నారు. సోమవారం గంగాధరనెల్లూరు మండలం ఆత్మకూరు, కడపగుంట పంచాయతీల్లో నేతలతో కలిసి థామస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టోపై ప్రజల్లో ఎలాంటి స్పందన లేదని, చివరకు ఆ పార్టీ నేతలు, కార్యకర్తల్లో సైతం విలువలేకుండా పోయిందన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో 9సార్లు నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయని చెప్పారు. చేతకాని అసమర్థ నాయకుడిని ఎన్నుకుంటే కష్టాలు తప్పవన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, అదేవిధంగా ఎంపీ అభ్యర్థిగా దగ్గుమళ్ల ప్రసాదరావులను గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. సమావేశంలో నేతలు ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, వెంకటేష్, శ్రీధర్‌యాదవ్, రాంబాబురెడ్డి, స్వామిదాస్, దేవసుందరం, మోహన్‌నాయుడు, కె.నాశంపల్లె ప్రభాకర్‌నాయుడు, జ్యోతిరెడ్డి, గజేంద్రనాయుడు, జ్యోతియాదవ్, నటరాజ్‌మొదలి, చిరంజీవినాయుడు, ప్రకాష్‌నాయుడు, కరుణాకర్ ఆచ్చారి, షణ్ముగం, చిదంబరం, ఆర్ముగం, స్టాన్లీ, రాజా, వెంకటేష్, షధ్రాక్, శేఖర్, వినాయకం, జనసేన నేత సురేష్ రెడ్డి, బీజేపీనేత సుందరరాజ్, దగ్గుమళ్ళ టీమ్‌సభ్యులు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం : ఉడమలకుడితి పంచాయతీలో డాక్టర్ థామస్ భార్య శాంతిరెడ్డి ఎన్డీఏ కూటమి అభ్యర్థులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె టీడీపీ సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు జయశంకర్ నాయుడు, నాయకులు, రుద్రప్పనాయుడు, చిన్నబ్బరాజు, అప్పల్‌రాజు, మండల బీజేపీ అధ్యక్షుడు జ్యోతిరెడ్డి, మండల జనసేన అధ్యక్షుడు చిరంజీవి, నాయకులు చందు, చార్లెస్ పాల్గొన్నారు.

పాలసముద్రం : మండలంలోని వెంగళరాజుకుప్పం పంచాయతీ గ్రామాల్లో చిత్తూరు పార్లమెంటు టీడీపీ కార్యదర్శి వాసునాయుడు సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు, నాయకులు జానకి రామనాయుడు, ప్రభాకర్ రాజు, జె. విజయ్‌కుమార్, రవి నాయుడు, మాధవరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్వేటినగరం : కార్వేటినగరం మండలం పొన్నగల్లులో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ కుమారుడు రోషన్ పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించి కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జనసేన ఇన్‌చార్జి యుగంధర్, మండల పార్టీ అధ్యక్షుడు చెంగల్‌రాయులు, నాయకులు జనార్ధన్ రాజు, నాగేశ్వరరావు, తిరుమలనాథ్, రవియాదవ్, లక్ష్మణ రాజు పాల్గొన్నారు.


వెంగళరాజుకుప్పంలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

ఐదేళ్లుగా మా ఊర్లో అభివృద్ధే జరగలేదు

టీడీపీకి ఓటు వేసి గెలిపిస్తాం ● తేల్చిచెప్పిన చెర్లోపల్లి ప్రజలు

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 29: వైసీపీ ఐదేళ్ల పాలనలో మా ఊర్లల్లో అభివృద్దే జరగలేదని చిత్తూరు రూరల్ మండలం చెర్లోపల్లి పంచాయతీ ప్రజలు టీడీపీ కూటమి చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం చిత్తూరు రూరల్ మండలంలోని చెర్లోపల్లి పంచాయతీ పరిధి గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఆయా ప్రాంతాల ప్రజలు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో వేసిన రోడ్లు, కాలువలతో సరి అప్పటి నుంచి మా గ్రామాల్లో అభివృద్ధి అనే మాటే లేదన్నారు. ఈ సారి మా ఓట్లను టీడీపీకి వేసి గెలిపిస్తామని, అధికారంలోకి రాగానే తమ గ్రామాల్లో మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలు కల్పించాలని విన్నవించారు. అధికారంలోకి రాగానే అడిగిన ప్రతి మాటను నెరవేరుస్తానని గురజాల హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు సీఆర్ రాజన్, టీడీపీ నాయకులు చంద్రప్రకాష్, జయచంద్రనాయుడు, కోదండ యాదవ్, మోహన్‌రాజ్, దేవరాజులు నాయుడు, శశికర్‌బాబు, రఘు, కాంద్ర రమేష్‌నాయుడు, రాజా, బాలక్రిష్ణనాయుడు పాల్గొన్నారు.

● **45వ డివిజన్ పరిధిలో :** నగరంలోని 45వ డివిజన్ పరిధిలోని రాజుగుడి, ఇందిరా నగర్, కరుమారియమ్మ గుడివీధిలలో మాజీ కార్పొరేటర్ సీఎం విజయ, డివిజన్ అధ్యక్షుడు చిట్టిబబాబుతో కలసి గురజాల జీవన్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలకు సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కంద, నేతలు గణేష్, కవిత, ప్రతాప్, సురేష్, కుప్పన్, బీజేపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

వంద మంది టీడీపీలో చేరిక

నగరంలోని 5వ డివిజన్ పరిధిలోని సాంబయ్య కండ్రిగ, 6వ డివిజన్ పరిధిలోని సంజయ్ గాంధీ నగర్ కాలనీకి చెందిన సుమారు వందమంది వైసీపీ కార్యకర్తలు బీజేపీ సీనియర్ నేత బాబు ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. స్థానిక బీవీ రెడ్డి కాలనీలోని గురజాల జగన్మోహన్ నివాసంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆర్. గాంధీ, మాజీ మేయర్ కటారి హేమలత తదితరులు పాల్గొన్నారు.


విజయ దంకా మోగిస్తున్న గురజాల, చంద్రప్రకాష్

గుడిపాల : మండలంలోని బసవాపల్లి పంచాయతీలో గురజాల జగన్మోహన్ తండ్రి గురజాల చెన్నకేశవులు నాయుడు ప్రచారం నిర్వహించారు. అధికారం ఉన్నా... లేకున్నా జీజేఎం ఛారిటబుల్ ఫౌండేషన్ ద్వారా నిరుపేదలను ఆదుకోవడమే లక్ష్యంగా సేవ చేస్తామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్‌ను, ఎంపీ అభ్యర్థి ప్రసాదరావును గెలిపించాలని కోరారు. మండల బీజేపీ అధ్యక్షుడు ధనుంజయ నాయుడు, మాజీ సర్పంచ్ ఉదయమధుసూధన్‌నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ జయశీలన్, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

రోజాకు ఆస్తులు పెరిగాయి.. ప్రజలకు కష్టాలు మిగిలాయి

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 29: ఈ ఐదేళ్లలో రోజాకు ఆస్తులు పెరిగితే... నియోజకవర్గ ప్రజలకు మాత్రం కష్టాలు మిగిలాయని ఎన్‌డీఏ కూటమి నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం క్లస్టర్ ఇన్‌చార్జి గంజి మాధవయ్య ఆధ్వర్యంలో తడుకు, కేబీఆర్ పురం పంచాయతీల్లో ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏపీఐఐసీ చైర్మన్‌గా రెండేళ్లు పదవి వెలగబెట్టిన రోజా నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు వచ్చే ఒక్క పరిశ్రమను కూడా సాధించలేదుగాని, కుటుంబసభ్యులకు ఒక్కొక్క మండలాన్ని కేటాయించి దోచుకోమనే ఉద్యోగం ఇచ్చిందని ఆరోపించారు. అరాచక పాలనకు ముగింపు పలికేందుకు ఎమ్మెల్యేగా తనకు, ఎంపీగా దగ్గుమళ్ల ప్రసాద్‌రావుకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. మాజీ ఎంపీపీ ఏలుమలై మొదలియార్ మాట్లాడుతూ నగరి నుంచి గాలి భానుప్రకాష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుని, రోజా కుటుంబానికి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తడుకు సర్పంచ్ బొబ్బిలియాదవ్, మాజీ సర్పంచ్ రవిశేఖర్‌రాజు, కరుణాయాదవ్, వెంకటేష్, బాబి, సతీష్‌నాయుడు, జనసేన సురేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గాలి భానుప్రకాష్

నింద్ర: ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్‌ను, ఎంపీ అభ్యర్థి ప్రసాద్‌రావును అఖండ మెజారిటీతో గెలిపించాలని తెలుగు మహిళలు ఇంటింటికి వెళ్లి అభ్యర్థించారు. చవరంబాకం, నెట్టేరి, కేఆర్‌పాలెంలో ప్రచారం నిర్వహించారు. తెలుగుమహిళలు నిరోషా, సంపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పరిశీలకుడిని కలిసిన జేసీ

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 29: చిత్తూరు ఆర్ అండ్‌బీ అతిథి గృహానికి సోమవారం నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల సాధారణ ఎన్నికల పరిశీలకుడు ఎండీ సాధిక్ ఆలామ్ చేరుకున్నారు. ఆయన్ను జేసీ శ్రీనివాసులు ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

బాలయ్యకు అపూర్వ స్వాగతం

చిత్తూరు సిటీ/బంగారుపాళ్యం, ఏప్రిల్ 29: జిల్లాలో పర్యటించిన బాలకృష్ణకు అడుగడుగునా అపూర్వ స్వాగతం లభించింది. బంగారుపాళ్యం, చిత్తూరులో వేల సంఖ్యలో బాలయ్యను చూసేందుకు ప్రజలు తరలివచ్చారు. రెండు గంటల పాటు పర్యటన ఆలస్యమైనా ఉత్సాహంతో వేచి చూశారు. చిత్తూరు గాంధీసర్కిల్, బంగారుపాళ్యం ప్రాంతాలు జనాలతో కిక్కిరిసిపోయాయి. రెండు ప్రాంతాల్లోనూ మహిళలు, ముస్లింలు ఎక్కువ సంఖ్యలో కనిపించారు. బంగారుపాళ్యం నాలుగు రోడ్ల కూడలి వద్ద, చిత్తూరు శివారు వేంగనపల్లె వద్ద ఎమ్మెల్యే అభ్యర్థులు గజ మాలతో ఘన స్వాగతం పలికారు. వేంగనపల్లె నుంచి గాంధీ సర్కిల్ వరకు వచ్చేందుకు సుమారు రెండు గంటల సమయం పట్టింది.

అవీ.. ఇవీ..

- చిత్తూరులో కొందరు అభిమానులు చేత్తో హారతి పట్టారు.
- చిత్తూరులో ఓ అభిమాని బాలయ్య ప్రసంగిస్తుండగా, ఉత్సాహం చూపించగా, తొడ కొట్టమని చెప్పారు.
- చిత్తూరు, బంగారుపాళ్యంలో జై తెలుగుదేశం, జై జనసేన, జై బీజేపీ, జై ఇండియన్, జై కూటమి అంటూ ప్రసంగాన్ని ముగించారు.
- గురజాల జగన్మోహన్ వేదిక మీద తన కుమారుడు గురజాల నితీశ్ చౌదరిని బాలయ్యకు పరిచయం చేశారు.
- చిత్తూరులో ప్రసంగం అయ్యాక పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు జాఫర్ టోపీ పెట్టి పూలమాలతో సన్మానించారు.
- టీడీపీ నేత, మాజీ కార్పొరేటర్ వసంత్ కుమార్ చిత్తూరులో ఖడ్గాన్ని నందమూరి బాలయ్య చేతికిచ్చారు.
- రెండు చోట్లా బాలయ్యకు సన్నిహితుడు, టీడీపీ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ ప్రారంభ ప్రసంగమిచ్చారు. రెండు చోట్లా అభ్యర్థులెవ్వరూ మాట్లాడలేదు.


బంగారుపాళ్యం రోడ్ షోలో బాలకృష్ణ, ఎమ్మెల్యే అభ్యర్థి మురళి మోహన్

స్వతంత్ర అభ్యర్థులకు గాజు గ్లాసు

● జనసేన ఓట్ల కోసం కుట్ర అంటున్న ప్రతిపక్షాలు

చిత్తూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇద్దరు స్వతంత్రులకు గాజు గ్లాసు గుర్తు కేటాయించారు. చిత్తూరు పార్లమెంటు స్థానానికి పోటీచేసే కొండా యుగంధర్‌కు, నగరి అసెంబ్లీకి పోటీ చేస్తున్న పి.జయరామయ్యకు జనసేన గుర్తు అయినటువంటి గాజు గ్లాసును కేటాయించినట్లు తెలిసింది. ఈ మేరకు జిల్లా ఎన్నికల అధికారులు అభ్యర్థులు- వారి గుర్తుల వివరాలను ఎన్నికల సీఈవోకు పంపించారు. అక్కడ ఆమోదం లభించాక అధికారికంగా ప్రకటించనున్నారు. రాష్ట్రంలో జనసేనకు, పవన్ కల్యాణ్‌కు పెరిగిన ఆదరణ దృష్ట్యా కొందరు కుట్రతో ఇలా గాజు గ్లాసును ఎంచుకుని ఓట్లను మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని ప్రతిపక్షాలు మండి పడుతున్నాయి.

టీడీపీ సానుభూతిపరులకు నీళ్లు బంద్


ఎంపీడీవో ప్రసన్నకుమారికి ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

పూతలపట్టు, ఏప్రిల్ 29: తెలుగుదేశం పార్టీకి సానుభూతిపరులుగా ఉంటూ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్ నామినేషన్ కార్యక్రమానికి హాజరైనందుకు వారం రోజులుగా నీరు బంద్ చేశారు. పూతలపట్టు పంచాయతీ పక్కాల గుట్టలో 30 కుటుంబాలు టీడీపీకి సానుభూతిపరులుగా ఉంటున్నారు. ఈ నెల 22న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మురళీమోహన్ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. విషయం తెలుసుకున్న స్థానిక వైసీపీ నేత నీళ్లు బంద్ చేయడంతో వారం రోజులుగా అవస్థలు పడుతున్నారు. స్థానిక టీడీపీ నేత గుంటూరు మురళి తన సొంత నిధులతో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. దీనిపై పూతలపట్టు పంచాయతీ టీడీపీ నేతలు సోమవారం ఎంపీడీవో ప్రసన్నకుమారికి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు యువరాజులు నాయుడు, మాజీ కన్వీనర్ ప్రతాపనేని చంద్రమౌళి, నాయకులు గుంటూరు మురళి, చిరంజీవి నాయుడు, హిమకర్ నాయుడు, మోహన్, ప్రమోద్ పాల్గొన్నారు.

మా ఊర్లోకి రావద్దు..

● వైసీపీ నేతలను అడ్డుకున్న వేపనపల్లి గ్రామస్తులు
● తమ పిల్లలపై తప్పుడు కేసులు బనాయించారంటూ ఆగ్రహం
● గ్రామంలో మూడు గంటల పాటు ఉద్రిక్తత


పోలీసులతో వాగ్వాదానికి దిగిన గ్రామస్తులు


జనసేన జెండా ఊపుతున్న యువకులు

పూతలపట్టు, ఏప్రిల్ 29: 'మా పిల్లలకు ప్రభుత్వ పథకాలు అందలేదని అడిగినందుకు తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపారు.. ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని వస్తున్నారు.. మా ఊర్లోకి వస్తే మర్యాదగా ఉండదు' అంటూ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థితోపాటు ఆ పార్టీ నాయకులను మండలంలోని వేపనపల్లి గ్రామస్తులు అడ్డుకున్నారు. వేపనపల్లి పంచాయతీ పరిధిలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్ కుమార్ సోమవారం ఉదయం ప్రచారానికి శ్రీకారం చుట్టారు. వేపనపల్లి గ్రామస్తులు, జనసేన, టీడీపీ నాయకులు ఏకమై తమ గ్రామంలోకి రావద్దంటూ పెద్దయెత్తున నినాదాలు చేశారు. పోలీసులు జోక్యం చేసుకుని గ్రామస్తులకు సర్దిచెప్పడానికి ప్రయత్నించినా ససేమిరా అనడంతో చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్ రెడ్డికి సమాచారం అందించారు. ఆయన పోలీసు బలగాలతో వేపనపల్లికి చేరుకున్నారు. ఈలోపు సునీల్ కుమార్ అక్కడికి చేరుకున్నారు. సహకరించాలని డీఎస్పీ గ్రామస్తులను కోరారు. తమ పిల్లలపై కేసులు పెట్టి ఇప్పుడు సిగ్గు లేకుండా ఎలా వస్తారని గ్రామస్తులు మండిపడ్డారు. ఆఖరుకు సునీల్‌ను మాత్రమే అనుమతిస్తామని, మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, ద్వారకనాథరెడ్డి గ్రామంలోకి రావడానికి వీల్లేదని పట్టుబట్టారు. ఈ క్రమంలో పోలీసు బందోబస్తు నడుమ సునీల్ గ్రామంలో ప్రచారం చేస్తుండగా జనసేన కార్యకర్తలు జెండాలు చేతబట్టి జై జనసేన అంటూ నినాదాలు చేశారు. ఎలాంటి గొడవా లేకుండా ప్రచారం ముగియడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. వైసీపీ నేతలకంటే పోలీసులే ఎక్కువగా ఉండడం చర్చనీయాంశమైంది.

విజయానందరెడ్డి కార్యాలయంలో విజిలెన్స్ దాడులు

చిత్తూరు, ఏప్రిల్ 29: చిత్తూరు నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంసీ విజయానందరెడ్డి కార్యాలయంలో సోమవారం జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీలు నిర్వహించింది. కొంగారెడ్డిపల్లెలోని ఎట్టెమ్మ ఆలయం వద్ద ఉన్న కార్యాలయంలో ఫ్లయింగ్ స్క్వాడ్ టీము లీడర్, డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో సభ్యులు తనిఖీలు చేశారు. లెక్కకు రాని రూ.6.50 లక్షల నగదు, రూ.20వేల విలువ చేసే 28 ప్యాంటు బిట్లు, ఆరు చీరలు ఉండగా సీజ్ చేశారు.

పక్కాగా సామాజిక పింఛన్ల పంపిణీ

● కమిషనర్ అరుణ

చిత్తూరు, ఏప్రిల్ 29: చిత్తూరు నగరపాలక సంస్థలో మే నెలకు సంబంధించిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పక్కాగా పంపిణీ చేయాలని కమిషనర్ అరుణ తెలిపారు. సోమవారం కమిషనర్ మెప్మా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పింఛన్ల పంపిణీని డీబీటీ ద్వారా డోర్ టూ డోర్ పంపిణీ చేయాలన్నారు. నగరపాలక సంస్థలో మొత్తం 16,627 పింఛన్లు ఉండగా ఇందులో 11,587 పింఛన్లను డీబీటీ ద్వారా పంపిణీ చేస్తే 5, 040 పింఛన్లను డోర్ టూ డోర్ అందించనున్నట్లు తెలిపారు. డీబీటీ ద్వారా పింఛన్లు అందకపోతే మరుసటి రోజు డ్రా చేసి సొమ్మును లబ్ధిదారులకు అందిస్తామన్నారు. పింఛన్ల పంపిణీని పర్యవేక్షించేందుకు పది వార్డులకు కలిపి ఒక సూపర్‌వైజర్‌ను నియమించామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎంఎం గోపి తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీ నేతలే టార్గెట్‌గా వేధిస్తున్నారు'

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 29: కొందరు ఎన్నికల అధికారులు వైసీపీ నేతలకు అనుకూలంగా పనిచేస్తున్నారని టీడీపీ నేతలు ఆరోపించారు సోమవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు గురజాల జగన్మోహన్, దగ్గుమళ్ళ ప్రసాదరావు, టీడీపీ నేతలే టార్గెట్‌గా తనిఖీల పేరుతో మానసికంగా వేధిస్తున్నారన్నారు. వైసీపీ అల్లరి మూకలు టీడీపీ కార్యకర్తలపై దాడిచేస్తే చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు వారిని విడిచిపెట్టి దెబ్బలు తిన్న తమ కార్యకర్తలను, తమ వాహనాన్ని స్టేషన్‌కు తరలించారన్నారు. ఇది పూర్తిగా ఎన్నికల నియమావళికి విరుద్ధమన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, చిత్తూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, నేతలు మోహన్‌రాజ్, మధు కుమార్ యాదవ్, రాధాకృష్ణ, గ్యాస్ రవి పాల్గొన్నారు.

వసంతోత్సవం ప్రారంభం

కార్వేటినగరం,ఏప్రిల్29: కార్వేటినగరం టీటీడీ వేణు గోపాలస్వామి ఆలయంలో సోమవారం వసంతోత్సవం ప్రారంభమైంది. స్వామివారికి ఆస్థాన కార్యక్రమం, స్నపన తిరుమంజనం నిర్వహించారు.



బంగారుపాళ్యం సభలో మాట్లాడుతున్న


బాలకృష్ణసభకు హాజరైన జనం

కమిషనర్, సీఐలపై చర్యలు తీసుకోండి

మా ఇంట్లో అనధికార సోదాలు నిర్వహించారు ● మా మనుషులను వైసీపీ వాళ్లు కొట్టినా పట్టించుకోలేదు
● ఎన్నికల సంఘానికి టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ఫిర్యాదు

చిత్తూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు మున్సిపల్ కమిషనర్ అరుణ, వన్‌టౌన్ సీఐ విశ్వనాథ్‌రెడ్డి మీద చిత్తూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాలు.. 'కమిషనర్ అరుణ తన బృందంతో కలిసి మా నివాసంలో అనధికార సోదాలు నిర్వహించారు. సెర్చ్ వారెంట్ చూపించమని గట్టిగా అడిగితే సోదాలన్నీ అయిపోయాక 11 గంటలకు ఇచ్చారు. నా నివాసంలో ఎలాంటి డబ్బు, మద్యం లభించలేదు. గతంలోనూ ఈమె ఇలానే మాటిమాటికీ అనవసర సోదాలు చేసి ఇబ్బంది పెట్టారు. అలాగే ఆదివారం తెల్లవారుజామున 2:30 గంటల ప్రాంతంలో మా మనుషులు సాయి కిరణ్, జగదీష్, విజయ్‌లను వైసీపీ వారు ఈడ్చుకెళ్లి వారి సెల్ ఫోన్లను లాక్కున్నారు. విచక్షణారహితంగా కొట్టారు. వన్‌టౌన్ సీఐ విశ్వనాథ్‌రెడ్డి నిందితులను వదిలేసి మా వాళ్లను కస్టడీలో ఉంచుకున్నారు. ఇది అన్యాయం. పై విషయాలను పరిగణనలోకి తీసుకుని సంబంధిత అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను' అని పేర్కొన్నారు. కమిషనర్ అరుణ, సీఐ విశ్వనాథ్‌రెడ్డితోపాటు చిత్తూరు తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, టూటౌన్ సీఐ ఉలసయ్య, అసిస్టెంట్ సిటీ ప్లానింగ్ ఆఫీసర్ రామకృష్ణుడు, చిత్తూరు అసెంబ్లీ నోడల్ అధికారి గోపాలకృష్ణవర్మ, వన్‌టౌన్ ఎస్ఐ షేక్ షావలి, చిత్తూరు ఫ్లయింగ్ స్క్వాడ్ టీఎస్ వేణుగోపాల్, వన్‌టౌన్ హెడ్ కానిస్టేబుల్ టి.పట్టాభి, చిత్తూరు వీఆర్వో కె.పవన్‌కుమార్ పేర్లనూ ఫిర్యాదులో పేర్కొన్నారు.

'మండే' సూర్యుడు

ఆరెంజ్ జోన్‌లో నింద్ర, పెద్దపంజాణి మండలాలు



నిర్మానుష్యంగా ఉన్న పలమనేరు ఎంబీటీ రోడ్డు - బోసిపోయిన బజారు వీధి

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 29: భానుడు భగ్గుమంటున్నాడు. జిల్లా వ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. సోమవారం నింద్ర, పెద్దపంజాణి మండలాలు ఆరెంజ్ జోన్‌లోకి చేరాయి. నింద్రలో 43.6, తవణంపల్లె 43.5, పెద్దపంజాణి 42.8, శ్రీరంగరాజపురం 42, పులిచెర్ల 41.5, గుడిపాల 41.4, పుంగనూరు, గంగవరం, సదుం 41.2, పాలసముద్రం 41.1, బంగారుపాళ్యం 40.8, చిత్తూరు 40.7, సోమల 40.6, చౌడేపల్లి, నగరి, పలమనేరు, రొంపిచెర్ల, పెనుమూరు 40.5, గంగాధరనెల్లూరు 40.3, కుప్పం 40.2, కార్వేటినగరంలో 40.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

పేదల ఊటీలోనూ మండుతున్న ఎండలు

పలమనేరు, ఏప్రిల్29 : పేదల ఊటీగా పేరున్న పలమనేరులోనూ ఈ ఏడాది ఎండలు మండుతున్నాయి. 40 డిగ్రీలకు తగ్గకుండా ఎండలు కాస్తుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 5.30గంటల వరకు ఇళ్లనుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. పట్టణానికి రెండు వైపులా విస్తరించి ఉన్న అడవికి నిప్పు పెట్టడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

వడదెబ్బతో వృద్ధుడి మృతి


సుబ్రహ్మణ్యం రెడ్డి (ఫైల్ ఫొటో)

గుడిపాల, ఏప్రిల్ 29 : ఎండ తీవ్రతను తట్టుకోలేక వృద్ధుడు మృతిచెందిన ఘటన గుడిపాల మండలం గొల్లమడుగు పంచాయతీలో సోమవారం చోటుచేసుకుంది. గొల్లమడుగు గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం రెడ్డి (64) మధ్యాహ్నం పశువులను మేతకోసం పొలానికి తోలుకుని వెళ్లి వస్తుండగా సొమ్మసిల్లి పడిపోయాడు. పక్క పొలాల వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చేలోపే ఆయన మృతిచెందాడు.

గుర్తుతెలియని వ్యక్తుల నిర్వాహకంతో
21ఎకరాల్లోని కొబ్బరి, మామిడి చెట్లు దగ్ధం



అగ్నిప్రమాదంలో కాలిపోయిన కొబ్బరి చెట్లు, విద్యుత్ స్టార్టర్‌తోపాటు వైర్లు

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 29: గుర్తుతెలియని వ్యక్తుల నిర్వాహకంతో కొబ్బరి, మామిడి చెట్లతోపాటు పీవీసీ, డ్రిప్ పైపులు, విద్యుత్ పరికరాలు అగ్నిప్రమాదంలో కాలిపోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ప్రమాదంలో 17 మంది రైతులకు చెందిన ఉద్యానవన పంటలు 75శాతం మేరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు పేర్కొన్నారు. గంగాధరనెల్లూరు పెద్దచెరువు కింద గంగాధరనెల్లూరు, కలిజవేడు పంచాయతీలకు చెందిన రైతుల భూముల్లో కొబ్బరి, మామిడి, టేకు, నీలగిరి తైలం చెట్లు ఉన్నాయి. గుర్తుతెలియని వ్యక్తులు ఎవరో శనివారం సాయంత్రం సుమారు అరకిలోమీటరు దూరంలో నిప్పు అంటించేశారు. ఆ మంటలు అంటుకుంటూ వస్తూ ఉద్యానవనపంటలపైకి రావడంతో ఫైరింజన్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి ఫైరింజన్ చేరుకోలేకపోవడంతో 75శాతం మేరకు పంట నష్టం వాటిల్లాయి. ఈ ప్రమాదంలో అక్కనగారిపల్లెకు చెందిన రైతులు భాస్కర్‌నాయుడు, జయచంద్రనాయుడు, కృష్ణమనాయుడు, మురళినాయుడు, మనోహర్‌నాయుడు, దొరస్వామినాయుడు, సుబ్రమణ్యంనాయుడు, దామోదరనాయుడు, పార్థసారధినాయుడు, అదేవిధంగా కలిజవేడు పంచాయతీలో కె.వెంకటాపురం గ్రామానికి చెందిన డిల్లీనాయుడు, రామానాయుడు, నాగేశ్వరరావునాయుడు, జ్ఞానప్రకాష్‌నాయుడు, రామచంద్రనాయుడు, మోహన్‌నాయుడు, హరినాయుడు, రాణెమ్మలకు చెందిన సుమారు 21 ఎకరాల్లో మామిడి, కొబ్బరి, టేకు, నీలగిరి తైలం చెట్లుతో పాటు పొలాలకు వేసిన పీవీసీ, డ్రిప్‌పైపులు, విద్యుత్‌వైర్లు, స్టార్టర్లు కాలిపోయాయి. ఉన్నతాధికారులు స్పందించి ఆదుకోవాలని పలువురు రైతులు విన్నవించారు.

చిత్తూరు అసెంబ్లీ బరిలో 13 మంది


చిత్తూరు ఆర్వో, జేసీ ఛాంబర్‌లో సమావేశమైన అభ్యర్థులు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 29: చిత్తూరు అసెంబ్లీ స్థానానికి 13 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. వారి వివరాలిలా ఉన్నాయి. జీసీ జగన్‌మోహన్ (టీడీపీ), ఎంసీ విజయానంద రెడ్డి (వైసీపీ), జి. టికారాం (కాంగ్రెస్), బి. గంగులయ్య (బీఎస్పీ), బి.కె.రమణారెడ్డి (అఖిల భారతీయ జనసంఘ్), వి. సరిత (సమాజ్‌వాది పార్టీ), వి.రవి (జై భీమ్‌రావ్ భారత్ పార్టీ), ఇండిపెండెంట్ అభ్యర్థులు.. వి. తేజెష్, కె. ప్రభాకర్ రెడ్డి, కె.వి. మోహన్ విజయ్‌కుమార్, వి.పురుషోత్తం, ములుగూరు అన్వేష్, రియాజ్‌బాషా ఉన్నారు.

● చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గం బరిలో 19మంది అభ్యర్థులు ఉన్నారు. దగ్గుమళ్ళ ప్రసాదరావు (టీడీపీ), ఎన్. రెడ్డెప్ప (వైసీపీ), ఎం. జగపతి (కాంగ్రెస్), విజయ్ కుమార్ (బీఎస్పీ), జానకిరామారావు (నేషనల్ మహాసభ), పళ్ళిపట్టు అభినవవిష్ణు (సమాజ్‌వాది), ఇండిపెండెంట్ అభ్యర్థులు ఎస్. గంగయ్య, ఎన్.చంద్రబాబు, టి.నరేష్, పూర్ణచంద్ర, బండపల్లి రమేష్, ఎన్. భూపతి, వి.మధు, డి.మహేష్, మాదాసి సుదర్శన్, కె.మునిక్రిష్ణ, పి.మోహన్, కొండా యుగంధర్, సి.సుధాకర్ ఉన్నారు.

పూతలపట్టు బరిలో అభ్యర్థులు వీరే...

పూతలపట్టు : పూతలపట్టు నియోజకవర్గం నుంచి పోటీలో ఉన్న అభ్యర్థులు వీరే... డాక్టర్ మురళీమోహన్(టీడీపీ), ఎం.ఎస్.బాబు(కాంగ్రెస్), సునీల్‌కుమార్ (వైసీపీ), పురుషోత్తం (సమాజ్‌వాది పార్టీ), నాగేశ్వర రావు (బహుజన సమాజ్ పార్టీ), విశ్వనాథ సాయి (అఖిల భారత జనసంఘ్ పార్టీ), సంతోష్ (విడుదలై చిరుతైగళ్ కట్చి), నవీన్ కుమార్ (ఆలిండియా మహిళా ఎంపవర్‌మెంట్ పార్టీ), హరిప్రసాద్ (భారత చైతన్య యువజన పార్టీ), స్వతంత్ర అభ్యర్థులు... రాజు, విజయభాస్కర్, ప్రవీణ్‌లు బరిలో ఉన్నారు.

ఎన్నికల రెమ్యునరేషన్, టీఏ, డీఏపై స్పష్టత

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 29: వచ్చే నెల 13న జరగబోవు సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న అధికారులు, సిబ్బందికి చెల్లించాల్సిన రెమ్యునరేషన్, టీఏ, డీఏలపై స్పష్టత వచ్చింది. ఈ మేరకు ఎన్నికల కమిషన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా వ్యాప్తంగా పోలీసు సిబ్బంది కాకుండా 12,500 మందిని విధులకు కేటాయించారు. శిక్షణా తరగతులు, పోలింగ్ మెటీరియల్స్ సేకరణ, పోలింగ్, ఓట్ల లెక్కింపు తదితర ప్రక్రియల్లో పాల్గొనే వారితోపాటు రిజర్వులో ఉన్న వారికి ఒకే రకమైన రెమ్యునరేషన్ చెల్లిస్తారు. బందోబస్తు, పహారా విధుల్లో పాల్గొన్న హోంగార్డు, ఫారెస్టు గార్డులు, గ్రామ రక్షక్‌దళ్, ఎన్‌సీసీ కేడెట్లు, ఎక్స్ సర్వీస్‌మెన్, వలంటీర్లకు ఇతర సిబ్బందికి చెల్లిస్తున్న విధంగానే రెమ్యునరేషన్, భోజనం, అల్పాహార సౌకర్యాలు కల్పిస్తారు. టీఏ, డీఏ 80 శాతం అడ్వాన్సుగా మిగిలిన 20 శాతం ఎన్నికల ప్రక్రియ ముగిసిన 30 రోజుల్లో చెల్లిస్తారు లేదా ఎన్నికల డ్యూటీ ముగిసిన 24 గంటల్లో వందశాతం చెల్లిస్తారు.

రూ.1.80 లక్షల కర్ణాటక మద్యం పట్టివేత

కారు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం - ముగ్గురి అరెస్టు


పోలీసుల అదుపులో నిందితులు.. స్వాధీనం చేసుకున్న మద్యం

రామకుప్పం, ఏప్రిల్ 29: మండలంలోని సంతమిట్టక్రాస్ వద్ద రూ.1.80లక్షల విలువైన కర్ణాటక మద్యాన్ని, కారు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని, ముగ్గురు నిందితులను అరెస్టు చేశామని కుప్పం డీఎస్పీ శ్రీనాథ్ సోమవారం తెలిపారు. కర్ణాటక సరిహద్దు గ్రామం రాజుపేటక్రాస్ నుంచి ఓ కారులో కర్ణాటక మద్యం తరలుతుందన్న సమాచారం రావడంతో రామకుప్పం ఎస్ఐ శివకుమార్ తన సిబ్బందితో విజలాపురం సమీపంలోని సంతమిట్ట వద్ద కారును ఆపి, తనిఖీ చేయగా 2,880 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం దొరికింది. కారుతో సహా మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వెనుక ద్విచక్ర వాహనాల్లో వస్తున్న కుప్పం మండలం ఎన్.కొత్తపల్లెకు చెందిన వరప్రసాద్, పైపాళ్యంకు చెందిన శ్యామరాజులను అదుపులోకి తీసుకుని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. రాజుపేటక్రాస్‌లోని వేణు బార్ అండ్ రెస్టారెంట్ మేనేజర్ నితీష్‌కుమార్‌గౌడ సహకారంతో మద్యం తరలిస్తున్నట్లు చెప్పడంతో అతన్ని కూడా అదుపులోకి తీసుకున్నారు. పోలీసు సిబ్బంది హరి, మురుగేష్, మంజునాథరెడ్డి, వరప్రసాద్‌లను డీఎస్పీ అభినందించి, రివార్డులు అందజేశారు.

ఘర్షణ కేసు నిందితులకు రిమాండ్

చౌడేపల్లె, ఏప్రిల్ 29: బోయకొండ క్రాస్ వద్ద ఘర్షణ కేసులో నిందితులైన టీడీపీ, వైసీపీ నాయకులకు మే 13 వరకు చిత్తూరు పీడీఎం కోర్టు జడ్జి రిమాండు విధించినట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 27వ తేదీ అర్ధరాత్రి బోయకొండ క్రాస్ వద్ద టీడీపీ మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి, అతని అనుచరులు, వైసీపీ నాయకులు లడ్డుల రమణ, అతని అనుచరులు ఘర్షణ పడడంతో ఇరువర్గాలపై కేసు నమోదు చేశామని, చిత్తూరు పీడీఎం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండు విధించారని చెప్పారు.

కాలువ పొరంబోకులో రోడ్డు


రోడ్డు వేస్తున్న వైసీపీ నాయకులు

నగరి ఏప్రిల్ 29: మండల పరిధిలోని ముడిపల్లి పంచాయతీ వెంకన్నకండ్రిగ ఎస్టీకాలనీలో కొండనీరు చెరువుకు వెళ్లే కాలువ పొరంబోకులో వైసీపీ నాయకుడు మనోహర్ నాయుడు తన అతిథిగృహానికి రోడ్డు వేశాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్కడ రోడ్డు వేయరాదని గతంలో హైకోర్టు స్టే విధించినా పట్టించుకోలేదన్నారు. తద్వారా చెరువుకు నీరు చేరే మార్గమే లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. అధికారులు జోక్యం చేసుకుని కాలువ పొరంబోకును కాపాడాలని కోరుతున్నారు.

జన చైతన్యం



బరిలో వీరు




సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎవరనేది సోమవారం సాయంత్రానికి లెక్క తేలింది. అసెంబ్లీ, పార్లమెంటు బరిలో 97 మంది ఉన్నారు. జిల్లాలోని చిత్తూరు పార్లమెంటు స్థానానికి 51, ఏడు అసెంబ్లీ స్థానాలకు 224 వెరసి 275 నామినేషన్లు వచ్చాయి. నామినేషన్ల పరిశీలన ముగిశాక పార్లమెంటు స్థానానికి 21మంది, అసెంబ్లీ స్థానాలకు 83 మంది కలిపి 104 మంది అభ్యర్థులు మిగిలారు. ఇక, చిత్తూరు పార్లమెంటు స్థానానికి ఇద్దరు, అసెంబ్లీ స్థానాలకు ఐదుగురు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో బరిలో 97 మంది మిగిలారు. వీరిలో చిత్తూరు పార్లమెంటుకు 19 మంది, ఏడు అసెంబ్లీ స్థానాలకు 78 మంది పోటీలో ఉన్నారు. అత్యధికంగా పలమనేరు అసెంబ్లీ నియోజకవర్గంలో 14 మంది, ఆ తర్వాత కుప్పం, చిత్తూరులో 13 మంది, పూతలపట్టులో 12, జీడీనెల్లూరులో 11, పుంగనూరులో 8, అత్యల్పంగా నగరిలో ఏడుగురు పోటీలో ఉన్నారు.

ఆర్కే రోజా.. కే రోజా

నగరి అసెంబ్లీలో వైసీపీ తరపున మంత్రి ఆర్కే రోజా పోటీలో ఉన్నారు. స్వతంత్ర అభ్యర్థిగా కే రోజా పోటీలో ఉన్నారు.

- చిత్తూరు కలెక్టరేట్

చిత్తూరు (ఎంపీ)



టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
దగ్గుమళ్ళ ప్రసాదరావు	ఎన్. రెడ్డెప్ప	ఎం. జగపతి	స్వతంత్రులు : 13 బీఎస్పీ: విజయ్ కుమార్ నేషనల్ మహా సభ : జానకి రామారావు సమాజ్‌వాది : అభినవ విష్ణు
			మొత్తం : 19

కుప్పం



టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
నారా చంద్రబాబునాయుడు	కేఆర్‌జే.భరత్	ఆవుల గోవిందరాజులు	స్వతంత్రులు : 4 బీఎస్పీ : గణేష్ వీసీకే పార్టీ : గోవిందప్ప జైభారత్ నేషనల్‌పార్టీ : రూప మరో మూడు పార్టీల నుంచి ముగ్గురు
			మొత్తం : 13 మంది

చిత్తూరు (అసెంబ్లీ)



టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
జీసీ జగన్మోహన్	ఎంసీ విజయానంద రెడ్డి	జి.టికారాం	స్వతంత్రులు : 6 బీఎస్పీ: బి.గంగులయ్య అఖిల భారతీయజనసంఘ్ : బీకే రమణారెడ్డి ఎస్పీ : వి.సరిత
			మొత్తం : 13 మంది

పూతలపట్టు



టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
మురళీమోహన్	సునీల్ కుమార్	ఎంఎస్ బాబు	స్వతంత్రులు : 6 బీఎస్పీ : నాగేశ్వర రావు బీసీవైపీ : హరిప్రసాద్ ఎస్పీ : పురుషోత్తం
			మొత్తం : 12 మంది

పలమనేరు



టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
ఎన్.అమరనాథరెడ్డి	ఎన్.వెంకటేగౌడ	బీ.శివశంకర్	స్వతంత్రులు : 9 బీఎస్పీ : ఆర్.శోభ వీసీకే పార్టీ : సి. వినోద్‌కుమార్
			మొత్తం : 14 మంది

జీడీ నెల్లూరు



టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
డాక్టరు థామస్	కృపాలక్ష్మి	రమేష్‌బాబు	స్వతంత్రులు : 3 బీఎస్పీ : భాస్కర్ సమాజ్ వాది పార్టీ : గుణశేఖర్
			మొత్తం : 11 మంది

పుంగనూరు



టీడీపీ	వైసీపీ	బీసీవై	కాంగ్రెస్	ఇతరులు
చల్లా రామచంద్రారెడ్డి	పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి	బీ.రామచంద్రయాదవ్	మురళీమోహన్‌యాదవ్	స్వతంత్రులు : 2 బీఎస్పీ : సురేష్ ఎస్‌డీపీఐ : అన్వర్‌బాషా
				మొత్తం : 8 మంది

నగరి



టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
భానుప్రకాష్	ఆర్కే రోజా	రాకేష్	స్వతంత్రులు ముగ్గురు నవరంగ్ కాంగ్రెస్ జ్ఞానప్రకాష్‌రెడ్డి
			మొత్తం : 7 మంది

బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం. భర్త వైసీపీ సర్పంచి అయినా తన పనేదో తను చేసుకుని పోతున్నారామె. కానీ, ఆ పార్టీలోని కబ్జాదారులైన నాయకులు ఆమెనలా ఉండనివ్వలేదు. ఊరి సంతకోసం అడుగుతున్న స్థలాన్ని కబ్జా చేశారు. ఒక బాధ్యత కలిగిన పౌరురాలిగా ఆమె ఊరికోసం అధికార పార్టీ నాయకులతో పోరాడారు. మంత్రి పెద్దిరెడ్డితోనే కలబడి నిలబడ్డారు. చివరకు కబ్జాకు గురైన స్థలంలో గొర్రెల సంత సాధించారు. ఆమే నీలావతి. శాంతిపురం మండలం మొరసనపల్లె వైసీపీ సర్పంచి జగదీశ్ భార్య. ప్రస్తుతం వైసీపీ రెబల్‌గా నిలబడి, స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారామె.

- కుప్పం



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కారును అడ్డుకుంటున్న నీలావతి (ఫైల్ ఫొటో)

ఊరికోసం

మంత్రితోనే కలబడి..!

● వైపీపీ 'రెబల్'గా తేలిన నీలావతి



కబ్జాకు గురైనట్లు చెబుతున్న భూమిలో అప్పట్లో సాగిన నిర్మాణాలు



మొరసనపల్లె పంచాయతీ పరిధిలోని సుమారు 64 సెంట్ల భూమిని టీడీపీ హయాం నుంచీ గొర్రెల సంతకోసం పంచాయతీ నాయకులు అడుగుతున్నారు. ఆ పని జరిగిపోయేదే కానీ, ఇంతలో వైసీపీ అధికారంలోకి వచ్చేసింది. ఆ పార్టీలోని బలమైన నాయకుల కన్ను ఈ స్థలంపై పడింది. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఈ 64 సెంట్ల డీకేటీ భూమి విలువ రూ.కోట్లలో ఉండడంతో ఆ పార్టీలోనే నాయకుల మధ్య దీనిని సొంతం చేసుకోవడానికి పోటీ నడిచింది. చివరికి వైసీపీ మండల కన్వీనర్ దండపాణి అనుచరుడు ఒకరు ఇదే ప్రాంతంలో కర్ణాటకకు చెందిన సుమారు 5 ఎకరాల భూమిని కొనుగోలు చేసి పనిలో పనిగా ఈ డీకేటీ భూమిని కూడా అందులో కలిపేసుకున్నాడన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. దానికి తగ్గట్టుగానే సదరు భూమిలో కట్టడాల నిర్మాణమూ ప్రారంభమైంది. మొరసనపల్లె సర్పంచి జగదీశ్ భార్య నీలావతి ఈ ఆక్రమణను సహించలేకపోయారు. నిజానికి ఆ డీకేటీ భూమిలో ఊరికోసం గొర్రెల సంత ఏర్పాటు చేయించాలని ఆమె కూడా భర్తతో కలిసి ఎప్పటినుంచో ప్రయత్నిస్తున్నారు. దీంతో నీలావతి నేరుగా ఎమ్మెల్సీ భరత్‌పై విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టారు. ఆయన అండతోనే మండల నాయకులు కొందరు డీకేటీ భూమిని కబ్జా చేశారని ఆరోపిస్తూ గ్రామస్థులను కలుపుకొని ధర్నాలు, రాస్తారోకోకు దిగారు. ఐదారు నెలల క్రితం మంత్రి పెద్దిరెడ్డి కారునే ఆమె అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. చివరకు నీలావతి పోరాటాన్ని తట్టుకోలేని అధికార పార్టీ నాయకులు కబ్జా చేసిన డీకేటీ స్థలాన్ని వదిలేశారు. ఇప్పుడా స్థలంలో సర్పంచితో కలిసి గొర్రెల సంత ఏర్పాటు చేయించారామె. దీంతో కక్ష పెంచుకున్న అధికార పార్టీలోని నేతలు కొందరు తమ అనుచరుల ద్వారా ఆమెపై నీచమైన వ్యాఖ్యలను పోస్ట్ చేస్తూ ట్రోల్ చేశారు. అయినా వెరవని నీలావతి, చివరకు వైసీపీ రెబల్‌గా మారి, ఈనెల 23న కుప్పం అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు.

ప్రలోభాలకు లొంగకుండా..

ఊరికోసం నిలబడినప్పుడు, తన జనం కోసం కలబడుతున్నప్పుడు, ఏ ప్రలోభాలూ లొంగదీసుకోలేవన్నదానికి నీలావతి నిదర్శనం. ఉపసంహరణల చివరి రోజైన సోమవారంనాడు, అంతకుముందు రాత్రి కూడా ఆమెకు ప్రలోభాల ఎరవేశారు అధికార పార్టీ నాయకులు. నియోజకవర్గ స్థాయి నేతలు కొందరు ఆ పార్టీ అభ్యర్థి తరఫున ఆమెతో మంతనాలు జరిపారు. నామినేషన్‌ను ఉపసంహరించుకోమని కోరారు. అలా చేస్తే పార్టీ అధికారంలోకి వస్తూనే ఏదో ఒక పవితోపాటు, లక్షల రూపాయల ఆఫర్ కూడా చేసినట్లు సమాచారం. వీటన్నింటినీ ఆమె తిరస్కరించారు. వైసీపీ జమానాలో ఊరికి, ఊరి ప్రజలకు న్యాయం జరగలేదు కాబట్టేతాను స్వతంత్రించి స్వతంత్ర అభ్యర్థిగా నిలబడుతున్నానని తెగేసి చెప్పారు. చివరకు ఆమె వైసీపీ రెబల్ అభ్యర్థిగా బరిలో నిలిచారు.

● పుంగనూరు

నాడు పుంగనూరు నియోజకవర్గంలో అగ్రనేతలుగా, పార్టీ.. ప్రభుత్వంలో ప్రధాన పాత్ర పోషించిన పలువురు నేతలు నేడు రాజకీయంగా కనుమరుగయ్యారు.

నాడు ప్రముఖ నేతలు


నేడు రాజకీయ కనుమరుగు



ఆర్.రెడ్డెప్పరెడ్డి



శ్రీధర్‌రెడ్డి



బగ్గిడి గోపాల్

● తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో 1983లో ఆ పార్టీ అభ్యర్థిగా బగ్గిడి గోపాల్ పోటీచేసి గెలుపొందారు. కొంతకాలానికి ఎన్టీఆర్‌పై తిరుగుబాటు చేసిన నాదెండ్ల భాస్కర్‌రావుకు మద్దతు ఇచ్చారు. దీంతో ఆయన తెలుగుదేశం పార్టీకి దూరమయ్యారు. క్రమేణా రాజకీయంగానూ కనుమరుగయ్యారు.

● 1999లో టీడీపీ అభ్యర్థి అమరనాథరెడ్డిపై కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఎన్.శ్రీధర్‌రెడ్డి విజయం సాధించారు. తర్వాత ఆయనకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం రాలేదు. బెంగళూరులో వ్యాపారాలు చేసుకుంటున్నాయన మళ్లీ అక్కడికే వెళ్లారు. ఆ తర్వాత పుంగనూరు రాజకీయాలను పట్టించుకోలేదు.

● 2004లో త్రిపుర పోలీస్ ఐజీగా పని చేస్తున్న ఆర్.రెడ్డెప్పరెడ్డి తన ఉద్యోగానికి రాజీనామా చేసి కాంగ్రెస్‌పార్టీలో చేరారు. ఈయనది పెద్దపంజాణి మండలం గోనుమాకులపల్లె. ఈయన తండ్రి ఓబుల్‌రెడ్డి పుంగనూరు సమితి మాజీ అధ్యక్షుడు. అప్పట్లో పెద్దపంజాణి మండలం పుంగనూరు నియోజకవర్గంలో ఉండింది. పుంగనూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా, 2004 ఎన్నికల్లో పోటీ చేశారు. అప్పటి టీడీపీ అభ్యర్థి ఎన్.అమరనాథ్‌రెడ్డి చేతిలో ఓటమి చెందారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పార్టీ ఇన్‌చార్జిగా ఆయన ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ కీలకంగా ఉన్నారు. 2009 నియోజకవర్గ పునర్విభజనతో పలమనేరు వెళ్లారు. రెండు పర్యాయాలు ఎమ్మెల్సీగా అవకాశం వచ్చింది. రెడ్డెప్పరెడ్డి పలమనేరుకు వెళ్లినా నాటి పుంగనూరు క్యాడర్‌లో చాలామంది ఆయనతో టచ్‌లోనే ఉన్నారు. ఆ తర్వాత రాజకీయంగా క్రియాశీలకంగా లేరు.

- పుంగనూరు


ఇదీ మందు



...అయితే ఎంతిస్తావ్..!

ఎన్నికల ప్రచారాలకు రావాలా.. అయితే ఎంతిస్తావ్. ఇదీ ఆయా పార్టీల అభ్యర్థులు, నేతలకు ఎదురవుతున్న ప్రశ్న. ప్రచారాల్లో పాల్గొనే మహిళలు, యువకులకు యమగిరాకీగా మారింది. మూడు పూటల తిండిపెట్టి ఖర్చుకి డబ్బు ఎంతిస్తారని ముందుగా మాట్లాడాకే ప్రచారానికి అడుగు పెడుతున్నారు. ఎన్నికల ప్రచారాలకు హాజరయ్యే ఆయా పార్టీల్లోని వారికోసం ప్రతిరోజూ ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రిల్లో టిఫిన్ లేదంటే మళ్ళీ భోజనం పెట్టాల్సి వస్తోంది. అసలే ఎండాకాలం.. దీంతో మధ్య మధ్యలో నీళ్ల బాటిళ్లు, మజ్జిగ ప్యాకెట్‌లు, కూల్‌డ్రింక్‌లు తప్పనిసరి. ఇంత ఖర్చు చేసి.. ఒక్కో వ్యక్తికి రూ.200 నుంచి 300వరకు నగదు ఇస్తున్నారు. ఏరోజుకారోజు డబ్బు చెల్లించాల్సిందే. లేదంటే మరుసటిరోజు రారు. ఇలా ప్రధాన పార్టీలు వీరిని ప్రచారాల్లో తిప్పేకొనేందుకు నానా అవస్థలు పడుతున్నారు.

- గంగాధరనెల్లూరు





జీడీనెల్లూరులో వైసీపీ రెబెల్

● బరిలో నిలిచిన సర్పంచి కరుణశ్రీ

వెదురుకుప్పం, ఏప్రిల్ 29: గంగాధరనెల్లూరు అసెంబ్లీకి వైసీపీ రెబెల్ అభ్యర్థిగా సర్పంచి కరుణశ్రీ పోటీలో ఉన్నారు. వైసీపీ సానుభూతిపరురాలైన ఆమె.. కార్వేటినగరం మండలం గోపిశెట్టిపల్లె సర్పంచిగా రెబెల్‌గా పోటీచేసి ఎన్నికయ్యారు. అప్పట్లో ఆమెను డిప్యూటీ సీఎం నారాయణస్వామి అభినందించారు. పార్టీ కార్యక్రమాల్లోనూ పాల్గొంటూ వచ్చారు. 'ఆ తర్వాత నన్ను పార్టీ కార్యక్రమాల'కు నారాయణస్వామి దూరం పెడుతూ వచ్చి, ఇబ్బందులకు గురి చేశారు. నా రాజకీయ ఎదుగుదలను అడ్డుకున్నారు. ఆ తర్వాత పరిణామాలతో పార్టీ కార్యక్రమాలకు దూరమయ్యా. ప్రజాసేవ చేయాలనే ఉద్దేశ్యంతో రాజకీయాల్లోకి వచ్చిన నేను ఇప్పుడు ఎమ్మెల్యే అభ్యర్థిగా (స్వతంత్ర) బరిలోకి దిగా' అని కరుణశ్రీ చెప్పారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా వెనక్కి తగ్గేది లేదన్నారు.

నోట్ దిస్ పాయింట్

1955లో 59,073
2024లో 2,00,822

● చిత్తూరు అసెంబ్లీలో ఓటర్లు ఇలా..

ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత 1955లో చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గంలో 59,073 మంది ఓటర్లు ఉన్నారు. 69 ఏళ్ల చరిత్రలో 14 సార్లు ఎన్నికలు జరిగాయి. తాజాగా 15వ సారి ఎన్నికలు జరగనున్నాయి. ప్రస్తుత ఈ ఓటర్ల సంఖ్య 2,00,822కి చేరింది. 1972 తర్వాత నుంచి లభ్యమైన ఓటర్ల వివరాల్లో 1999వరకు పురుష ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. ఆ తర్వాత 2004 నుంచి మహిళా ఓటర్ల ప్రభంజనం మొదలైంది. ప్రస్తుతం 2,00,822 ఓటర్లలో పురుషులు 97,765,మహిళలు 1,03,023, ఇతరులు 34 ఉన్నారు.

- చిత్తూరు కలెక్టరేట్

పలమనేరు
కుప్పం/పుంగనూరు

పుంగనూరు రేసులో 8 మంది

పుంగనూరు, ఏప్రిల్29: సార్వత్రిక ఎన్నికల్లో పుంగనూరు అసెంబ్లీకి 8మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వై.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ సందర్భంగా ఎస్.జమీర్, పి.ఫయాజ్‌లు విత్‌డ్రా చేసుకున్నట్లు చెప్పారు. టీడీపీ అభ్యర్థిగా చల్లా రామచంద్రారెడ్డి, వైసీపీ అభ్యర్థిగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా మురళీమోహన్‌యాదవ్, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా సురేశ్, ఎస్‌డీపీఐ అభ్యర్థిగా అన్వర్‌బాషా, బీసీవై పార్టీ అభ్యర్థిగా బోడే రామచంద్రయాదవ్, స్వతంత్ర అభ్యర్థులుగా జి.రామయ్య, నాగేశ్వరరావు పోటీలో నిలిచినట్లు ఆయన వెల్లడించారు.

పలమనేరు బరిలో 14 మంది

పలమనేరు, ఏప్రిల్29: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పుంగనూరు అసెంబ్లీ బరిలో 14 మంది నిలిచారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎన్.మనోజ్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ తర్వాత 14 మంది పోటీలో ఉన్నారు. టీడీపీ అభ్యర్థిగా ఎన్.అమరనాథరెడ్డి, వైసీపీ తరఫున ఎన్.వెంకటేగౌడ, కాంగ్రెస్ నుంచి బీ.శివశంకర్, బీఎస్పీ నుంచి ఆర్.శోభ, వీసీకే పార్టీ నుంచి సి.వినోద్ కుమార్ పోటీలో నిలిచారు. స్వతంత్రులుగా సి.ఉమామహేశ్వరరెడ్డి, ఎస్.అరుణ్‌కుమార్, వీ.పవిత్ర కావలి, కే.బాషా, అలసాపుర సుబ్రమణ్యం, ఆర్.అమరనాథరెడ్డి, అమరనాథరెడ్డి, ఎల్.దామోదరనాయుడు, బొమ్మనపల్లి లక్ష్మన్న బరిలో ఉన్నారు.

బాబు రుణం తీర్చుకుందాం..!



ఎన్టీఆర్ కాలనీలో ప్రచారం చేస్తున్న రాజ్‌కుమార్ తదితరులు

కుప్పం, ఏప్రిల్ 29: కుప్పం నియోజకవర్గానికి, రాష్ట్రానికి అభివృద్ధితోపాటు, ప్రజలకు సంక్షేమాన్ని అందించిన చంద్రబాబు రుణం తీర్చుకునే సమయం ఆసన్నమైనదని టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్య క్షుడు రాజ్‌కుమార్ అన్నారు. ఈ ఎన్నికల్లో లక్ష ఓట్ల మెజారిటీని ఆయనకు అందించడం ద్వారా రుణం తీర్చుకోవాలని ప్రజలను కోరారు. కుప్పం పురపాలక సంఘం పరిధిలోని ఎన్టీఆర్ కాలనీలో సోమవారం ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలతో కూడిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో ప్రజలపై వేధింపులు పెరిగిపోయాయని గుర్తుచేశారు. సుపరిపాలన, శాంతిభద్రతల పరిరక్షణ కోసం చంద్ర బాబును గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి సత్యేంద్రశేఖర్, వేలు, మణి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును గెలిపించి రుణం తీర్చుకోవాలి



కొంగనపల్లెలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

రామకుప్పం, ఏప్రిల్ 29: అనాదిగా వివక్షకు గురైన కుప్పం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో పయనింపజేసిన టీడీపీ అధినేత చంద్రబాబును లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించి ఆయన రుణం తీర్చుకోవాలని ఆ పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీఎంపీపీ ఆంజినేయరెడ్డి, మాజీవైస్‌ఎంపీపీ చిన్నికృష్ణులు ఓటర్లను కోరారు. సోమవారం విజలాపురం, కొంగనపల్లె పంచాయతీల్లో వారు ప్రచారం చేశారు. ఆయా కార్యక్రమాల్లో తెలుగుయువత మండల అధ్యక్షుడు విశ్వనాథ్ పాల్గొన్నారు.

టీడీపీతోనే యువతకు బంగారు భవిష్యత్తు



నారాయణపురంలో ఇంటింటా ప్రచారంలో తెలుగుయువత నేతలు

రామకుప్పం, ఏప్రిల్ 29: రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం వస్తేనే యువతకు బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలుగుయువత రామకుప్పం మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం తెలిపారు. సోమవారం వారు మండల పరిధిలోని నారాయణపురంతాండా, కొంగనపల్లెల్లో యువచైతన్యయాత్రలో భాగంగా చంద్రబాబు తరఫున ఇంటింటా ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇస్తారన్నారు. ఈ కార్యక్రమాల్లో శంకర్‌చలం, రామాంజులు, రవికుమార్‌రెడ్డి, వెంకటరమణ, జ్ఞానశేఖర్‌రెడ్డి, భాస్కర్, పవన్, బాలకృష్ణ, కొళ్లపల్లె విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలగా మిగిలిన కాజ్‌వే..!

- ఎన్నికలప్పుడు వస్తారు.. వెళ్తారు
- ఎన్నికలు కాగానే ఏటిగడ్డిండ్లు సమస్య కనుమరుగు
- దశాబ్దాలుగా కౌండిన్యపై కాజ్‌వేకు నోచుకోని యానాదులు



చెక్‌డ్యాంపై ఆస్పత్రికి వెళ్తున్న గిరిజనులు

పలమనేరు, ఏప్రిల్29 : ఎన్నికలప్పుడు మాత్రం రాజకీయ నాయకులు వారి గ్రామానికి వెళ్లి వారి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇస్తారు. ఎన్నికలు కాగానే ఆ గ్రామం వైపు కన్నెత్తి చూడరు. అన్ని పార్టీలూ ఇందుకు మినహాయింపు కాదు. పలమనేరు మండలంలోని మునలిమడుగు గ్రామ సమీపంలో ఏటిగడ్డిండ్లు యానాది కాలనీ ఉంది. ఈ కాలనీ వాసులు పట్టణానికి రావాలంటే తమ గ్రామం నుంచి సుమారు మూడు కిలోమీటర్లు వచ్చి మొసలిమడుగు గ్రామానికి నుంచి ఆటోల్లో పలమనేరుకు రావాలి. అయితే వీరి కాలనీకి మొసలిమడుగు గ్రామానికి మధ్య కౌండిన్య నది ప్రవహిస్తోంది. వర్షాకాలం వస్తే వీరు కౌండిన్యనది దాటి రావడం కుదరదు. ఉధృతంగా ప్రవహించే కౌండిన్య నదిని దాటడం ప్రాణాంతకం. ఫలితంగా నది ప్రవహించినంత కాలం ఇతర ప్రాంతాలతో సంబంధాలు తెగిపోతాయి. దీంతో వారు కొన్ని దశాబ్దాలుగా కౌండిన్య నదిపై ఒక కాజ్‌వే నిర్మించాలని కోరుతున్నారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వచ్చే ప్రతి నాయకుడినీ వీరు కోరే ఒకే ఒక్క కోరిక కాజ్‌వే నిర్మాణం. నాయకులు సైతం వారికి ఇచ్చే మొదటి హామీ కాజ్‌వే నిర్మిస్తామని చెప్పడం. తీరా ఎన్నికలు కాగానే కాజ్‌వే మాట మరిచిపోతున్నారు. ప్రతి ఎన్నికల సమయంలోనూ కాజ్‌వే వస్తుందనే ఆశతో వారు ప్రజలు ఓట్లు వేయడం.. తర్వాత నాయకులు హామీని అటకెక్కించడం మామూలైంది. ఇలా దశాబ్ధాలు గడిచిపోయాయి. కాజ్‌వే కలగా మిగిలిపోయింది. దీంతో ఆ గ్రామసులు కౌండిన్య నదిపై నిర్మించిన చెక్‌డ్యాంపైనే రాకపోకలు సాగిస్తున్నారు. నదిలో నీరు ఉన్న రోజుల్లో విద్యార్థులు బడికి వెళ్లి మళ్లీ ఇంటికి తిరిగి వచ్చే వరకు వారి తల్లిదండ్రుల ఆందోళన అంతాఇంతా కాదు.



చెక్‌డ్యామ్‌పై పాఠశాలకు నడచివెళ్తున్న విద్యార్థులు

నేటి నుంచి నడివీధి గంగమ్మ జాతర

చౌడేపల్లె, ఏప్రిల్29: చౌడేపల్లె నడివీధి గంగమ్మ జాతర మంగళ, బుధవారాలలో జరుగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ మంగళవారం రాత్రి అమ్మవారికి కళ్యాణం, బుధవారం దీలు, బోనాలు, జంతుబలలు సమర్పించనున్నారు.

సంక్షేమం, అభివృద్ధి చంద్రబాబుకే సాధ్యం

చౌడేపల్లె, ఏప్రిల్29: సంక్షేమం, అభివృద్ధి చంద్రబాబుకే సాధ్యం అని పుంగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి సోదరి వీణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆమె మండలంలోని యల్లకుంట్ల పంచాయతీ లో ఇంటింటా ప్రచారం చేశారు. సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి చల్లా రామచంద్రారెడ్డిని ఎమ్మెల్యేగా, కమలం గుర్తుపై ఓట్లేసి రాజంపేట ఎంపీగా నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చంద్రవదనమ్మ, నాయకులు, బాబునాయుడు, చంద్రమౌళి, గని, అమీద్ ఖాన్, హరిప్రసాద్, యల్లకుంట్ల రమేష్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు: టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలతో టీడీపీ విజయం తథ్యమని పుంగనూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి కుమార్తె పూజారెడ్డి తెలిపారు. పులిచెర్ల మండలం పాతపేట, చల్లావారిపల్లి పంచాయతీల్లో సోమవారం ఆమె ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి నెలా రూ.1500 నగదు, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామన్నారు. టీడీపీ నాయకులు రామనాథంనాయుడు, సుబ్బారెడ్డి, కుమార్‌రెడ్డి, ధనంజయ నాయుడు, మురళీనాయుడు పాల్గొన్నారు.

సోమల: ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని పుంగనూరు నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ మదన్ మోహన్‌బాబు సోమల, గన్నావారిపల్లెలో ఇంటింటా కరపత్రాలను అందజేశారు. ● ఇరికిపెంట పంచాయతీలో జిల్లా సర్పంచుల సంఘం మాజీ కార్యదర్శి శ్రీనివాసులు నాయుడు ఆధ్వర్యంలో చల్లాబాబును, కిరణ్ కుమార్‌రెడ్డిని గెలిపించాలని ప్రచారం చేశారు. ● జనసేన మండల అధ్యక్షుడు సూరి శెట్టి నాగభూషణం రాయల్ ఆధ్వర్యంలో గురికానివారిపల్లెలో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో చెన్నపట్నం చెరువు సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు కోటీశ్వరరావు, భానుప్రకాశ్‌నాయుడు, పీ.చంద్రశేఖర్ నాయుడు పాల్గొన్నారు.

పుంగనూరు రూరల్: టీడీపీ నాయకులు పట్టణంలోని నాగపాళ్యం, చర్చివీధి, భగత్‌సింగ్‌కాలనీ, మేలుపట్ల తదితర ప్రాంతాలల్లో ఎన్నికల ప్రచారం చేశారు. వైసీపీ పాలన అరాచకాలు, అక్రమాలు, దోపిడీలు, దౌర్జన్యాలతో సాగుతోందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుహేల్‌బాషా, దినేశ్‌కుమార్, నవీన్‌కుమార్, సద్దాంహుసేన్ పాల్గొన్నారు.

రొంపిచెర్ల: చల్లా రామచంద్రారెడ్డి సతీమణి చల్లా సుప్రియారెడ్డి పెద్దమల్లెల పంచాయతీలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రమణ, నాయకులు మిద్దింటి వెంకట్రమణ, హరికృష్ణ, రెడ్డెప్ప, దామోదరం, పీరాసాహెబ్, చాను, జబీవుల్లా, మస్తాన్‌లు పాల్గొన్నారు. ● పులిచెర్ల మండలం కమ్మపల్లి పంచాయతీ బాలిరెడ్డిగారిపల్లె చెందిన వైసీపీ నాయకుడు, ఉపసర్పంచ్ తిమ్మారెడ్డి, మోహన్‌రెడ్డి, కురవపల్లెకు చెందిన క్రిష్ణప్ప టీడీపీలో చేరారు. చల్లా సుప్రియారెడ్డి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. చల్లా పూజారెడ్డి పాల్గొన్నారు.



పెద్దమల్లెలలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న చల్లా సుప్రియారెడ్డి



పులిచెర్ల మండలంలో కరపత్రాలు అందజేస్తున్న చల్లా పూజారెడ్డి



పుంగనూరులో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

నిరుద్యోగులకు రూ.3వేల నిరుద్యోగ భృతి : టీడీపీ

బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 29 : టీడీపీ అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులకు రూ.3వేల నిరుద్యోగ భృతి ఇస్తామని ఆ పార్టీ నాయకులు తెలియజేశారు. సోమవారం మండలంలోని కడతట్లపల్లె, వెంగంవారిపల్లె, గడ్డూరు, కోట్రేపల్లె, మునిపల్లె తదితర గ్రామాల్లో టీడీపీ నాయకులు ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సైకిల్‌గుర్తుకు ఓటేసి టీడీపీ ఎంపీగా దగ్గుమళ్ల వరప్రసాద్‌ను, ఎమ్మెల్యేగా అమరనాథరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయనున్న సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరిస్తూ ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి, మాజీ ఎంపీపీ కృష్ణవేణి, మాజీ జడ్పీటీసీ రాధమ్మ, నాయకులు జయకుమార్, మంజునాథరెడ్డి, భువనచంద్ర గౌడు, గోవిందస్వామి, కృష్ణమూర్తి, రమేష్, శ్రీనివాసమూర్తి, రాజేష్, శంకరప్ప, నాగరాజు, శేషుగౌడు పాల్గొన్నారు.



కడతట్లపల్లెలో ఎన్నికల ప్రచారంలో టీడీపీనాయకులు

అన్న క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం



కుప్పంలో పేదలకు అన్నదానం చేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల

కుప్పం, ఏప్రిల్ 29: ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ జన్మదిన వేడుకలు కుప్పంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహం ఎదుట అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు అన్నదానం నిర్వహించారు. భారీ కేక్ కట్ చేసి ఎమ్మెల్సీని సత్కరించారు. కుప్పం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జి సత్యేంద్రశేఖర్, గంగమ్మ గుడి మాజీ చైర్మన్ బీఎంకే.రవిచంద్రబాబు, మంజునాథ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

శాంతిపురం: ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ జన్మదిన వేడుకలను మండల పార్టీ కార్యాలయంలో సోమవారం టీడీపీ నేతలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ శ్రీకాంత్‌కు ఘనంగా సన్మానం చేశారు. ఎన్టీఆర్ విగ్రహం వద్ద అన్నా క్యాంటీలో పేదలకు అన్నదానం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు బాష్యం విశ్వనాథనాయుడు, మాజీ ఎంపీపీ ఉదయకుమార్‌నాయుడు, మాజీ మండల అధ్య క్షుడు విజయరామిరెడ్డి, క్లస్టర్ ఇంచార్జి చంద్రశేఖర్, యూనిట్ ఇంచార్జిలు మణి, పెద్దన్న, రమేష్‌రెడ్డి, నారాయణరెడ్డి, ఉయ్యాల జయరామిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఏఎంసీ నాగరాజు, శివశంకర్‌గౌడు, రమేష్, మహిళ నేతలు శ్యామల, రూప, పౌలారాణి, సరిత తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ సంక్షేమ ఫలాలు చంద్రన్నతోనే సాధ్యం

శాంతిపురం, ఏప్రిల్ 29 : అర్హులైన ప్రతి పేదవాడికీ సంక్షేమ ఫలాలు అందాలంటే అది చంద్రన్నకే సాధ్యమని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, శాంతిపురం క్లస్టర్ ఇన్‌చార్జి విజయ రామిరెడ్డిలు అన్నారు. సోమవారం గుంజార్లపల్లె పంచాయతీ కరేగానూరు గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని పూజలు చేశారు. తర్వాత ఇంటింటా ప్రచారం చేశారు. 2019 ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వైసీపీ విఫలమైందని తెలిపారు. వైసీపీ నేతల అరాచకాలు, అక్రమాలు, దాడులు, దౌర్జన్యాలతో ప్రజలు తీవ్ర ఇక్కట్ల పాలయ్యారని తెలియజేశారు. అలాంటి వారు మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రం అంధకారం అవుతుందని పేర్కొన్నారు. ప్రజలు ప్రశాంతంగా జీవించాలంటే చంద్రబాబు గెలిపించాలన్నారు. అనంతరం కొలమడుగు, దండికుప్పం పంచాయతీలలో కుటుంబ సాధికార సారథులు, బూత్ కన్వీనర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 60 మంది ఓటర్ల బాధ్యత తీసుకున్న సాధికారతులు రోజూ వారితో మాట్లాడుతూ ఆ 60 ఓట్లు చంద్రబాబుకు వేసేలా చూడాలన్నారు. అప్పుడే మనం లక్ష ఓట్లు మెజారిటీ లక్ష్యాన్ని చేరుకోగలమన్నారు. ప్రచారానికి మిగిలిన 12 రోజుల్లో ఓటర్లను రెండు సార్లు కలిసి టీడీపీ అధికారంలోకి వస్తే జరిగే మంచిని, వైసీపీ వస్తే సమాజానికి కలిగే నష్టం గురించి వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు రెస్కో మాజీ వైస్ చైర్మన్ చలపతిస్వామి, యూనిట్ ఇన్‌చార్జి ఆంజనేయ రెడ్డి, పంచాయతీ పార్టీ అధ్యక్షుడు వెంకటరమణ, నారాయణరెడ్డి, ఆనందరెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కరేగానూరులో మహిళకు కరపత్రం అందిస్తున్న గౌనివారి శ్రీనివాసులు

కనుల పండువగా లక్ష్మీనారాయణుడి రథోత్సవం





రథాన్ని లాగుతున్న భక్తులు , రథంపై సతీసమేతంగా కొలువుదీరిన లక్ష్మీనారాయణస్వామి

శాంతిపురం, ఏప్రిల్ 29 : మండల పరిధిలోని కెనమాకులపల్లె గ్రామంలో వెలిసిన లక్ష్మీనారాయణ స్వామి రథోత్సవం కనుల పండువగా సాగింది. లక్ష్మీనారాయణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం ఆలయ ధర్మకర్తలు, గ్రామస్తులు స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి విశేష అలంకరణలు చేశారు. ఆలయ నిర్వాహకులు రథాన్ని శుభ్రం చేసి వస్త్రాలు, పుష్పాలు, అరటిచెట్లు మామిడి తోరణాలతో అలంకరించారు. 10 గంటలకు వేదపండితులు రథానికి ప్రత్యేక పూజలు చేసి వివిధ రకాల హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు స్థానిక బ్రాహ్మణులు సర్వాలంకారశోభితులైన లక్ష్మీనారాయణ స్వామి సతీసమేత ఉత్సవ మూర్తులను డప్పుల హోరు, మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణల మధ్య రథంలో అధిష్ఠింపజేశారు. రథంలో స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళహారతులిచ్చారు. మధ్యాహ్నం 12:45 గంటలకు గోవింద నామస్మరణల మధ్య భక్తులు రథాన్ని లాగి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు దవనం, పుష్పాలు అమర్చిన అరటిపళ్లను రథంపైకి విసిరి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు గ్రామస్తులు వడపప్పు, పానకాలు, పెసరపప్పు, మజ్జిగ పంపిణీ చేశారు. ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం రథం తిరిగి ఆలయం చేరుకుంది. రాత్రి ధూళి ఉత్సవం నిర్వహించారు.

కుప్పం బరిలో 13 మంది

కుప్పం, ఏప్రిల్ 29: నామినేషన్ల ఘట్టం ముగిసేసరికి కుప్పం బరిలో 13 మంది అభ్యర్థులు పోటీలో మిగిలారు. మొత్తం 18 మంది నామినేషన్లు వేయగా ముగ్గురు అభ్యర్థుల నామి నేషన్లను అధికారులు పరిశీలన దశలోనే తిరస్కరించారు. మిగిలిన 15 మంది అభ్యర్థులు చివరిదాకా కొనసాగారు. అయితే నామినేషన్ల ఉపసంహరణల తుది రోజైన సోమవారం నాడు స్వతంత్ర అభ్యర్థులు దుర్గ, రామ చంద్రప్పలు నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. ప్రస్తుతం కుప్పం బరిలో 13 మంది అభ్యర్థులు మిగిలారు. పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి పార్టీల వివరాలు ఇలా ఉన్నాయి.

1. నారా చంద్రబాబు నాయుడు (టీడీపీ)
2. కేఆర్‌జే.భరత్ (వైసీపీ)
3. ఆవుల గోవిందరాజులు (కాంగ్రెస్ పార్టీ)
4. గణేశ్ (బీఎస్పీ)
5. గోవిందప్ప (వీసీకే పార్టీ)
6. అక్బర్ (భారతీయ ప్రజాగళ కళ్యాణ పక్ష)
7. రూప (జై భారత్ నేషనల్ పార్టీ)
8. ప్రసాద్ (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా)
9. జగదీశ్ (నవరంగ్ కాంగ్రెస్ పార్టీ)
10. మురళీధర్ అలియాస్ వసనాడు మురళి (స్వతంత్ర)
11. ప్రకాశ్ (స్వతంత్ర)
12. నీలమ్మ (స్వతంత్ర)
13. నాగరాజు (స్వతంత్ర)

భగవద్గీత పుస్తకాల పంపిణీ



పలమనేరు, ఏప్రిల్29 : పలమనేరు సమీపంలోని పొన్నమాకులపల్లి గ్రామంలో త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రబోధ సేవాసమితి ఇందు జ్ఞానవేదిక సభ్యులు ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేశారు. ఇందు జ్ఞానవేదిక బంగారుపాళ్యం, పలమనేరు కమిటీల అధ్యక్షులు, సభ్యులు భాస్కర్, బాలాజి, ఉదయ్, రాజేంద్ర, జీవరత్నం, వింధ్య, హేమంత్, జ్యోతి, రెడ్డెమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీతో రెడ్లకు ఒరిగిందేమీ లేదు



64 పెద్దూరులో రెడ్ల కుటుంబాలను కలిసి ఓట్లు అభ్యర్థిస్తున్న టీడీపీ రెడ్డి సామాజిక వర్గం నేతలు

శాంతిపురం, ఏప్రిల్ 29 : వైసీపీ ప్రభుత్వంలో రెడ్లకు ఒరిగిందేమీ లేదని టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు విజయరామిరెడ్డి, టీడీపీ సీనియర్ నేత నారాయణరెడ్డి, మాజీ సర్పంచులు సంఘం అధ్యక్షుడు నాగభూషణంరెడ్డి, కుప్పం నియోజకవర్గ కార్యకర్తల సంక్షేమ విభాగం కమిటీ సభ్యులు ఉయ్యాల జయ రామిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని చిన్నారిదొడ్డి, సాతు, రెడ్డివారిపల్లె, బొమ్మనపల్లె 64 పెద్దూరు, గెనికపల్లె, నక్కనపల్లె గ్రామాలో రెడ్డి సామాజిక వర్గం కుటుంబాలను కలిశారు. ఐదేళ్ల జగన్ ప్రభుత్వంలో జరిగిన అరాచకాలు, దాడులు, దౌర్జన్యాలు, అక్రమాలను గురించి వివరించారు. గ్రామాలు అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధికారంలో ఉండాలన్నారు. అందుకోసం చంద్రబాబును మే 13న జరిగే ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రెడ్డి సామా జిక వర్గం నేతలు జని, మునిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, హరినాథ్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, భయ్యారెడ్డి, రామక్రిష్ణరెడ్డి, జయచంద్రా రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


టీడీపీ వైపే ఎర్రచేన్లు ఎస్టీకాలనీ



టీడీపీకి సంఘీభావం తెలుపుతున్న ఎర్రచేన్లు ఎస్టీకాలనీ వాసులు

రామకుప్పం, ఏప్రిల్ 29: తామంతా టీడీపీ వైపే ఉన్నామని బందార్లపల్లె పంచాయతీ ఎర్రచేన్లు ఎస్టీ కాలనీ వాసులు స్పష్టం చేశారు. ఆదివారం రాత్రి టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, పంచాయతీ అధ్యక్షుడు శ్రీనాథరెడ్డి, నాయకులు మునిరెడ్డి, పెరుమాళ్, మంజునాథ్, లక్ష్మీనారాయణరెడ్డి, మంజునాథరెడ్డి తదితరులు గ్రామంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులంతా గ్రామ కూడలికి వచ్చి టీడీపీకి మద్దతు ప్రకటించారు. ఇటీవల గ్రామంలోకి ప్రచారానికి వచ్చిన వైసీపీ నేతలు తమకు బలవంతంగా కండువాలు కప్పారని తెలిపారు. ఎవరు ఎన్ని ప్రలోభాలు పెట్టినా తామంతా చంద్రబాబుకు అండగా నిలిచి లక్ష ఓట్ల మెజారిటీ లక్ష్యంలో భాగస్వాములవుతామని తెలియజేశారు.

మామిడితోటకు నిప్పు



రామకుప్పం, ఏప్రిల్ 29: రామకుప్పానికి చెందిన నూర్‌అహ్మద్ మామిడి తోటకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. నూర్‌అహ్మద్‌కు కడిసినకుప్పం వద్ద మామిడితోట ఉంది. ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. సుమారు 50 చెట్లు కాలిపోయాయి. కాగా ఈ తోట విషయంలో తన సోదరి కుటుంబసభ్యులకు, తమకు మధ్య వివాదం నడుస్తోందని తెలియజేశారు. హైకోర్టు ఆ తోటపై స్టే ఆర్డర్ ఇచ్చిందని వివరించారు. ఈ క్రమంలో వారే నిప్పు పెట్టి ఉంటారని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అల్పాహారం పంపిణీ

పలమనేరు, ఏప్రిల్29 : పలమనేరు సమీపంలోని డ్రైవర్స్ కాలనీ వాసులకు సోమ వారం పలమనేరులోని సామాజిక కార్యకర్త మధుమోహన్‌రావు అల్పాహారాన్ని, తాగు నీటి బాటిళ్లను పంపిణీ చేశారు. వేసవి కారణంగా పనులకు వెళ్లలేక కాలనీ ప్రజలు ఇబ్బందులు పడుతుండడంతో అందించినట్లు దాత తెలియజేశారు.